ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 30.5
కనిష్ఠం 24.2
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 4 అక్టోబరు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.20 (305.6242)	2,61,176	2,56,244
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.90 (4.17)	3,227.96	3,138.27
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.2906 (40.2110)	2,01,325	1,85,166

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240

అంబరాన్నంటిన సంబరాలు



నల్లగొండలోని రామాలయం వద్ద వేడుకల్లో పాల్గొన్న పట్టణవాసులు

నల్లగొండలోని వివేకానంద నగర్‌లో రావణాసుర బొమ్మను దహనం చేస్తున్న స్థానికులు

దసరా సంబరాలు అంబరాన్నంటాయి. గురువారం జిల్లా అంతటా విజయదశమిని ఉత్సాహంగా జరుపుకున్నారు. జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో శమీవృక్ష, ఆయుధ పూజలు చేసి ఆలయాలను సందర్శించారు. శుభసూచకంగా భావించే పాలపిట్ట దర్శనం చేసుకున్నారు. అయితే మహాత్మాగాంధీ జయంతి, దసరా ఒకేరోజు రావడంతో మద్యం, మాంసం దుకాణాలు మూసీ ఉండటంతో పలువురు ఇబ్బందులకు గురయ్యారు. కొందరు ముందుచూపుగా బుధవారం రాత్రి కొనుగోలు చేసుకున్నారు. మరికొంత మంది దసరా రోజున అధికారుల నిఘా తక్కువగా ఉండే గ్రామాల్లోని దుకాణాలను ఆశ్రయించి అధిక ధరలతో కొనుగోలు చేసి పండుగ కానిచ్చారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ కల్చరల్)

తెల్లవారుజామునుంచే సమీపంలోని ఆలయాలకు చేరుకుని ఇష్ట దైవాన్ని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. ఆలయాలన్నీ ముందు రోజే అందంగా అలంకరించారు. పట్టణంలో భారీగా బాణాసంచా కాల్చారు. చిన్నా, పెద్దా, పేద, ధనిక అనే భేదం లేకుండా స్థాయికి తగినట్లు సంబురాల్లో మునిగితేలారు. అదేవిధంగా పలు దుకాణాల యజమానులు విజయదశమి సందర్భంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాలకు చేరుకుని శమీపూజలో పాల్గొన్నారు. దసరా సందర్భంగా ఆలయాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. శమీపూజలో జమ్మిచెట్టుకు భక్తులు కోర్కెలతో కూడిన పత్రాలను సమర్పించి ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని కాంక్షించారు. అనంతరం భక్తులు పాలపిట్టను దర్శించుకున్నారు.

రామాలయంలో..

నల్లగొండ పట్టణంలోని రామగిరిలోగల సీతారామచంద్ర స్వామి దేవాలయంలో విజయదశమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆవరణలో సాయంత్రం శమీపూజలు నిర్వహించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డి చైతన్య దంపతులు ముఖ్య అతిథిగా హాజరై జమ్మి చెట్టుకు శమీ పూజ చేశారు. వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పరవశించిపోయారు. రాత్రి 9గంటల వరకు భక్తులు వరుస క్రమంలో ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో ఈశ్వరయ్య, రాజేశ్వర్‌రావు, మధుసూదన్‌రెడ్డి, ఆది నారాయణ, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ పీఠం అధిష్ఠించేదెవరో?



స్థానిక సంస్థలకు ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో జడ్పీ చైర్మన్ పీఠాలపై ఆసక్తి నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ జడ్పీ చైర్‌పర్సన్ స్థానం ఎస్టీ మహిళకు కేటాయించగా, సూర్యాపేట చైర్మన్ పదవి బీసీలకు, యాదాద్రి భువనగిరి జిల్లా చైర్‌పర్సన్ పదవి బీసీ మహిళకు కేటాయించడంతో ఆ పదవి దక్కించుకునే నేతలు ఎవరనే చర్చ సాగుతోంది. జడ్పీ చైర్మన్ పదవి ఆశించే నేతలు తొలుత జడ్పీటీసీ సభ్యులుగా గెలుపొందాల్సి ఉండడంతో ఆశావహనేతలు సులభంగా గెలిచే స్థానంకోసం వెతుకులాట మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- ఉమ్మడి జిల్లాలో ఆసక్తికర పరిస్థితి
- నల్లగొండ చైర్‌పర్సన్ పదవికి కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్సీని బరిలో దించే అవకాశం
- సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో పావులు కదుపుతోన్న బీసీ నేతలు
- నామినేషన్లు మొదలైతేనే స్పష్టత వచ్చే అవకాశం

జడ్పీటీసీ స్థానాలకు పార్టీలపరంగా ఇంకా ఎలాంటి కసరత్తు మొదలు కాలేదు. అయితే అధికార కాంగ్రెస్‌లో జడ్పీటీసీ స్థానాలకు ప్రతీ మండలం నుంచి మూడు పేర్లను ఖరారు చేసి ఇన్‌చార్జి మంత్రి ద్వారా పీసీసీకి పంపితే, పీసీసీ అభ్యర్థుల జాబితాను ఖరారు చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేయడంతో తొలుత జడ్పీటీసీ టిక్కెట్‌కోసం ఆ పార్టీలో ఆశావహులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, వామపక్షాల నుంచి ఇంకా కార్యాచరణ మొదలు కాలేదు. నోటిఫికేషన్ విడుదలయ్యే 9వ తేదీనాటికి ఈ పార్టీలన్నీ తమ అభ్యర్థులను ఎంపిక చేస్తాయని నాయకులు చెబుతున్నారు.

ప్రతిష్ఠాత్మక నల్లగొండ జడ్పీ పీఠం దక్కేదెవరికో....?

ప్రస్తుతం రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లా పరిషత్‌గా ఏర్పాటైన నల్లగొండ జడ్పీ చైర్‌పర్సన్ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వ్ చేశారు. ఉద్ధండులైన రాజకీయ నేతలున్న ఈ జిల్లాలో ఎవరి ఆశీస్సులతో ఈ పదవి ఎవరిని వరిస్తుందోననే ఆసక్తికరమైన చర్చ రాజకీయవర్గాల్లో సాగుతోంది. జిల్లాలోని 33 జడ్పీటీసీ స్థానాలకు ఎస్టీ మహిళకు పెద్దవూర, డిండి స్థానాలు రిజర్వ్ కాగా, ఎస్టీ జనరల్‌కు దేవరకొండ, పీఏపల్లి, కొండమల్లేపల్లి స్థానాలు రిజర్వ్ అయ్యాయి. ఈ అయిదు స్థానాలతోపాటు జనరల్, జనరల్ మహిళలకు కేటాయించిన స్థానాల్లోనూ ఎస్టీ మహిళలు పోటీచేసే అవకాశం ఉండడంతో ఆ కోటాలో రిజర్వ్ అయిన అడవిదేవులపల్లి, నేరేడుగొమ్ము, చందంపేట, దామరచర్ల, తిరుమలగిరిసాగర్ సీట్లలో పోటీ చేసేందుకూ ఎస్టీ నేతలు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. అధికార పార్టీలో ఎస్టీ నేతగా కీలక భూమిక పోషించిన దివంగత మాజీ ఎమ్మెల్యే రాగ్యానాయక్ సతీమణి, మాజీ ఎమ్మెల్సీ భారతీ రాగ్యానాయక్ పేరును కాంగ్రెస్ అధిష్ఠానం జడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా పరిశీలించే అవకాశముందని రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. ఈమె కొంతకాలం దేవరకొండ ఎమ్మెల్యేగా, ఆ తర్వాత ఎమ్మెల్సీగానూ పనిచేసిన నేపథ్యం ఉండడంతోపాటు, ఈమె కుమారుడు స్కైలాబ్‌నాయక్ కాంగ్రెస్‌లో క్రియాశీలకనేతగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈమె పేరును పరిశీలిస్తారని భావిస్తున్నారు. సొంత మండలం దామరచర్ల, అడవిదేవులపల్లితోపాటు ఎస్టీ రిజర్వ్ అయిన దేవరకొండ నియోజకవర్గంలోని స్థానాల్లో ...

- మిగతా 7వ పేజీలో...

8వ తేదీపైనే అందరి దృష్టి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ వీటిని రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో కేసు నడుస్తున్న విషయం తెలిసిందే. ఒక వైపు కేసు ఉన్నప్పటికీ న్యాయనిపుణుల సలహాలతో రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల గెజిట్ ఇవ్వగా, రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. ఎన్నికలు జరిగి తీరుతాయనే విశ్వాసంతో కాంగ్రెస్ ఎన్నికలకు సన్నద్ధమవుతుంటే, విపక్షాలు మాత్రం 8వ తేదీ వరకు వేచి చూస్తున్నట్లు కనిపిస్తోంది. 42 శాతం రిజర్వేషన్లను హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం కొట్టివేస్తే ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే అంశంపైనా అందరిలో ఉత్కంఠ కొనసాగుతోంది. కోర్టు కేసు నేపథ్యంలోనే ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటికీ ఎన్నికల్లో పోటీచేయాలని భావించే నాయకులు ఎవరు కూడా దసరా సందర్భంగా ఎలాంటి హడావిడి చేయలేదు. పలువురు ఆశావహులు ఫోన్లకు సైతం స్పందించకుండా దూరంగా ఉన్నారు. 9న నోటిఫికేషన్ రానుండడం, 8వ తేదీన హైకోర్టు విచారణ తర్వాత వచ్చే మార్గదర్శకాలకనుగుణంగా ముందుకు సాగాలని రాజకీయ నాయకులు భావిస్తున్నారు.

ప్రజా సంక్షేమమే...
శ్వాసగా..ధ్యాసగా

7



(ఆంధ్రజ్యోతి,సూర్యాపేట, సూర్యాపేట-కలెక్టరేట్)

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకర్గాలే కాకుండా ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధిలో మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తనదైన ముద్రవేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండుసార్లు మంత్రిగా పని చేసిన అయన అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడలేదు. తుంగతుర్తి సాగునీరు సరిగా లేక వ్యవసాయ భూములు పడావు ఉండడం గుర్తించి దానికి పరిష్కార మార్గం శ్రీరాంసాగర్ రెండో దశ అని గుర్తించా రు. తుంగతుర్తి నియోజకవర్గానికి శ్రీరాంసాగర్ జలాలు తేవడంలో ప్రధాన భూమిక పోషించారు. 1996లో తిరుమలగిరిలో ప్రగతినగర్ వద్ద ఎస్సారెస్పీ కాల్వలకోసం శంకుస్థాపన చేసి శిలాఫలకం వేయించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలోనూ తనవంతు పోరాటం చేశారు.

సూర్యాపేట టౌన్: రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పార్థివదేహం ప్రత్యేక అంబులెన్స్‌లో సాయంత్రం ఆరు గంటలకు సూర్యాపేట పట్టణానికి చేరుకుంది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి మొదలైన ర్యాలీ కోర్టు చౌరస్తా, పూల సెంటర్, పొట్టి శ్రీరాములు సెంటర్, రాఘవాప్లాజా నుంచి శంకర్‌విలాస్, ఎంజీ రోడ్డు మీదుగా కొత్తబస్టాండ్, ఖమ్మం క్రాస్ రోడ్ నుంచి రాత్రి 9గంటల సమయంలో దామోదర్‌రెడ్డి నివాసానికి(రెడ్ హౌస్) చేరింది. ప్రజల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఉంచారు. తమ నాయకుడి భౌతికదేహంపై పూలు చల్లి నివాళులర్పించారు.

ఆర్డీఆర్‌కు ప్రముఖుల నివాళి



మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి భౌతికకాయానికి పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. మంత్రి సీతక్క, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీ‌ష్‌రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్, సీఎల్పీ మాజీ నేత, కాంగ్రెస్ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి తదితరులు ఆర్డీఆర్ మృతదేహం పై పూలమాలవేసి నివాళులర్పించారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ పటేల్ రమే‌ష్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్‌లు నివాళుర్పించారు.

సమాజానికి మంచి చేయాలి

● కలెక్టర్ ఇలాత్రిపాఠి



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, జైలు అధికారి ప్రమోద్

నల్లగొండ క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు జైలు జీవితం నుంచి బయటకు వచ్చిన తర్వాత సమాజానికి మంచి చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. గురువారం గాంధీ జయంతిని పురస్కరించుకొని జిల్లా జైలులో ఏర్పాటు చేసిన ఖైదీల సంక్షేమ దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం సాధించే క్రమంలో మహాత్మాగాంధీ అనేక సార్లు జైలుకు వెళ్లారని, సత్యాగ్రహం ద్వారా స్వాతంత్య్రం సాధించారని చెప్పారు. ఖైదీలు జైలు జీవితం అనంతరం సమాజంలో 10మందికి సాయం చేసే విధంగా మెలగాలని పిలుపునిచ్చారు. జైలులో సమయాన్ని వృథా చేయకుండా లైబ్రరీలో ఉన్న పుస్తకాలను చదవాలని, చదువు ద్వారా ఆలోచన పెరుగుతుందన్నారు. జిల్లా జైలు అధికారి ప్రమోద్ మాట్లాడుతూ జిల్లా జైలులో ఖైదీల సంక్షేమంకోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఖైదీలు అనేక ఉత్పత్తులను తయారు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, న్యాయమూర్తి సౌందర్య, ఆర్డీవో వై.అశోక్ రెడ్డి,బాలకృష్ణ, రాధాకృష్ణ, వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీరాం పాల్గొన్నారు.

యువతలో భక్తిభావం పెరగాలి



శోభయాత్రలో పాల్గొన్న అదనపు ఎస్పీ రమేష్

నల్లగొండ క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): యువతలో భక్తిభావం పెంపొందినప్పుడే సమాజంలో మరింత మార్పు వస్తుందని అదనపు ఎస్పీ రమేష్ అన్నారు. జిల్లాకేంద్రంలోని చంద్రగిరి విలాస్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన దుర్గమాత శోభయాత్రను ప్రారంభించి ఆయన మాట్లాడారు. భక్తిభావం పెరిగితే ప్రతిఒక్కరూ సరైన మార్గంలో నడుచుకుంటారన్నారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని ఏర్పాట్లను చేసినట్లు వివరించారు.

నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ఇతర శాఖల సమన్వయంతో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ సైదాబాబా, కాలనీవాసులు గోవర్ధన్, చందన్, రత్నాకర్‌రావు, కృష్ణ, శంకర్, రవీంద్రనాథ్, సుధాకర్, సత్తయ్య, శ్రీను, సైదులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దసరా .. రూ.30కోట్లు

జిల్లాలో జోరుగా మద్యం విక్రయాలు ● దసరా సందడి

రామగిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో దసరా పండుగ సందర్భంగా రూ.30కోట్ల మద్యం విక్రయాలు సాగాయి. సాధారణంగా ప్రతీరోజు రూ.15కోట్ల నుంచి రూ.20కోట్లు విక్రయాలు జరుగుతుండగా.. దసరా పండుగరోజు మాత్రం రెట్టింపు స్థాయిలో విక్రయాలు జరిగినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. దీన్నిబట్టి చూస్తే పట్టణ ప్రజలు ఎంజాయ్ చేసేందుకు ఖర్చుకు ఏమాత్రం వెనక్కి తగ్గదే లేదని స్పష్టం చేస్తున్నారు. వినియోగదారుల అవసరాన్ని ఆసరా చేసుకున్న కొంత మంది వైన్స్ నిర్వాహకులు నిబంధన లు తమకు వర్తించవన్నట్లుగా అర్ధ రాత్రి వరకు విక్రయించారు. వైన్స్‌లో పనిచేసే కొంతమంది గుమస్తాలు సైతం లిక్కర్‌ను ఒకరోజు ముందే ఇళ్లలో నిల్వ చేసుకొని దసరా నాడు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నారు. గత సంవత్సరం కంటే 10శాతం ఎక్కువే విక్రయాలు జరిగినా... ఈ సారి స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యం లో గత సంవత్సరానికి అదనంగా 30శాతం విక్రయాలు జరిగే అవకాశాలుంటాయని అధికారులు అంచనావేశారు. కానీగత సంవత్సరానికి పోల్చుకుంటే 10శాతంమాత్రమే అదనపు వ్యాపారం జరగడంతో దసరా వ్యాపా రంపై గాంధీ జయంతి ప్రభావం పడిందని అధికారులు పేర్కొంటున్నారు.



మాంసం సైతం ఒకరోజు ముందే విక్రయాలు

దసరా పండుగ గాంధీ జయంతి రోజున రావడంతో మటన్, చికెన్ వ్యాపారులు అక్టోబరు 1వ తేదీ అర్ధరాత్రి వరకూ విక్రయాలు జరిపారు. తద్వారా సమారు రూ.కోటి వ్యాపారం జరిగినట్లు అంచనా.

బిజీ బిజీగా నేతలు

స్థానిక సంస్థల ఎన్నికలే రాజకీయాలకు తొలిమెట్టు. అందుకే ఆయా స్థానాలకు అంత ప్రాధాన్యం ఉంటుంది. సర్పంచ్ అయినా, ఎంపీటీసీగా గెలిచినా, జడ్పీటీసీగా విజయం సాధించినా ఆ గుర్తింపే వేరుగా ఉంటుంది. అందుకే ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోకుండా ప్రయత్నాలు చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో దసరా సందర్భంగా పల్లెల్లో ప్రత్యేక సందడి నెలకొంది. రిజర్వేషన్లు ప్రకటించడం, సామాజిక సమీకరణాలు జరగడంతో దాదాపు సీటు తమకే అనుకున్న అభ్యర్థులు బంధుమిత్రుల దసరా సరదా తీరుస్తున్నారు. ఓటర్ల వివరాలు సేకరించడం, దసరా పండుగకు వచ్చిన వారిని కలిసి పలకరించడం కనిపించింది. వారి వారి ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా విందులు, వినోదాలు ఏర్పాటు చేశారు.

ప్రసన్నం చేసుకుంటూ..

నగరంలో నివసిస్తున్నా.. పట్నంలో ఉంటున్నా పండుగకు పల్లెకు రాకుండా ఉండరు. అందులోనూ దసరా పండుగ. అందుకే పల్లెను వీడిన ప్రతిఒక్కరూ గ్రామాలకు వస్తుంటారు. పచ్చనిపైర్ల మధ్య పండుగ నిర్వహించేందుకు పల్లెకొచ్చిన ఓటర్లను ఇదే అవకాశమంటూ ప్రసన్నం చేసుకుంటున్నారు ఆశావహులు.

పండుగకొచ్చిన వారిని ప్రసన్నం చేసుకుంటున్న నాయకులు



మళ్లీ వస్తారు కదా.. అంటూ..

దసరా, దీపావళి పండుగలు కొద్ది రోజుల వ్యవధిలోనే రానున్నప్పటికీ దసరాకు సొంతూళ్లకు వచ్చేవారితో పోలిస్తే దీపావళికి వచ్చే వారు తక్కువగా ఉంటారు. అందుకే విజయదశమి పండుగకు వచ్చిన ఓటర్లను కలిసి ఆప్యాయంగా పలకరించడం, ఫోన్ నెంబరు, అడ్రస్ తీసుకున్నారు. ఎన్నికల షెడ్యూల్‌కు అనుగుణంగా మళ్లీ తప్పక వస్తారు కదా.. అంటూ ఆలింగనం చేసుకుంటున్నారు. పండుగ సంబరాలు ముగియడంతో కొందరు శనివారమే పట్టణాలకు పయనమవుతుండగా, మరికొందరు సండే సరదా చూసుకుని సోమవారం ఉదయం వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

తాయిలాల పంపిణీ షురూ..

మర్రిగూడ: స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలవడంతో పల్లెల్లో ఎన్నికల హడావుడి మొదలైంది. ఎన్నికలకోసం ఓటర్లకు చేరువై వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడి ముందస్తుగా తాయిలాల పంపిణీ షురూచేశారు. ఎన్నికల్లో బాగంగా సర్పంచ్, ఎంపీటీసీ పదవులకోసం బరిలో ఉండి పోటీచేసే అభ్యర్థులు ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు మండలంలోని పలు గ్రామాల్లో దసరా పండుగ సందర్భంగా ఇంటింటికీ చికెన్, మద్యం పంపిణీ చేసే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. అభ్యర్థులు దసరా పండుగ నుంచే తాయిలాలు పంపిణీ చేస్తుంటే ఓటర్లు మాత్రం గుట్టుచప్పుడు కాకుండా తీసుకుంటున్నారు. మద్యం, మాంసం కాకుండా అభ్యర్థులు ఇంకా ఎలాంటి తాయిలాలు ఇస్తారోనని ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎంపీటీసీ, సర్పంచ్‌లకు పోటీచేసే అభ్యర్థులకు రూ.లక్షన్నర మించకుండా ఎన్నికల్లో ఖర్చు చేయాలని నిబంధనలు ఉన్నా, అవేవీ పట్టించుకోకుండా ఒక అభ్యర్థి రూ.30లక్షల నుంచి రూ.50లక్షల వరకు ఖర్చుచేసే యోచనలో ఉన్నట్లు సమాచారం.

పండుగ వేళ విషాదం

- రోడ్డు ప్రమాదంలో సోదరులు మృతి
- మృతుల్లో ఒకరు కానిస్టేబుల్



వేముల నాగరాజు, కార్తీక్ (ఫైల్)

దసరా పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపిన క్షణాలు మరిచిపోకముం దే ఓ కుటుంబంలో విషా దం నెలకొంది. ద్విచక్రవాహనం అదుపు తప్పిన ఘటనలో సోదరులు మృతి చెందారు. గురువారం రాత్రి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం బండరామారం క్రాస్ రోడ్డు వద్ద ఈ విషాదం నెలకొంది. అమ్మమ్మకు పిండి వంటకాలు ఇచ్చి వస్తుండగా ఈ ఘటన జరగడంతో ఆ కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

- (ఆంధ్రజ్యోతి-తుంగతుర్తి)

3

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు
గుణపాఠం తప్పదు

● మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి

నల్లగొండ,అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఆ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన నల్లగొండ మండల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. మోసపు మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో చులకన అయిందన్నారు. ఎక్కడికక్కడ ఆ పార్టీ నాయకులు ప్రజలను దోచుకు తింటున్నారని విమర్శించారు.తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పనులు చేయించుకొని లబ్ధి పొందిన వారు, తీరా ఎన్నికలప్పుడు పార్టీకి వెన్నుపోటు పొడిచారని, తనను కూడా అవమార్చే విధంగా వ్యవహరించారన్నారు. వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే సమాధానం చెప్పబోతున్నారన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థుల విజయంకోసం ప్రతిఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కటికం సత్తయ్యగౌడ్, కొండూరు సత్యానారాయణ, దేప వెంకట్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లగొండ లైబ్రేరియన్ నాగయ్య మృతి


కట్ట నాగయ్య(ఫైల్)

నల్లగొండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాకేంద్ర గ్రంథాలయం లైబ్రేరియన్ కట్ట నాగయ్య(55) శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందారు. దసరా పండుగ కోసం స్వగ్రామం యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం నాగారం గ్రామానికి వెళ్లారు. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో గుండెనొప్పి వస్తోందని చెప్పడంతో కుటుంబసభ్యులు వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే చనిపోయినట్లు డాక్టర్లు నిర్ధారించారు. సమాచారం తెలియగానే నల్లగొండ జిల్లాకేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ హఫీజ్‌ఖాన్, కార్యదర్శి బానోతు బాలమ్మ వెంటనే నాగారం చేరుకున్నారు. నాగయ్య మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ పరంగా అంత్యక్రియలకు ఇచ్చే రూ.30వేలు అందజేశారు.

ఒంటరితనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

చిట్యాల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఒంటరితనం భరించలేక వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ చిట్యాల పట్టణంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ మామిడి రవికుమార్ తెలిపిన ప్రకారం.. పట్టణంలోని రెండో వార్డుకు చెందిన ఊయ్యాల శంకరయ్య(79) భార్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. ఒంటరితనాన్ని భరించలేని ఆయన మనస్తాపంతో గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శంకరయ్య కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్లైఉడ్ దుకాణంలో మంటలు

చిట్యాల, అక్టోబరు 3,(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని ప్లైఉడ్ దుకాణం దగ్ధమైంది. పట్టణంలోని సాయిద్వారకాపురి కాలనీలో గల ఓ ప్లైవుడ్‌షాప్‌లో దసరా రోజు దేవుడి దగ్గర దీపం వెలిగించి దుకాణం యజమాని ఇంటికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు దీపంతో మంటలు చెలరేగి దుకాణం నుంచి పొగలు రావడంతో గమనించిన చుట్టు పక్కలవారు యజమానికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. గడ్డపారతో తాళాలు తొలగించి మంటలు ఆర్పారు. సామాను దగ్ధమై సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కట్టంగూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలంలోని అయిటిపాముల గ్రామపంచాయతీ పరిధిలోని గంగదేవిగూడెంలో శుక్రవారం జరిగింది. బాధిత రైతు రెడ్డెబోయిన శ్రీశైలం తెలిపిన వివరాల ప్రకారం... రోజు మాదిరిగా తన గేదెలను మేత మేపేందుకు తీసుకెళ్లాడు. విద్యుత్ తీగ తెగిపడి ఉండడంతో విద్యుదాఘాతానికి గురై గేదె మృతిచెందింది. గేదె విలువ సమారు రూ.లక్ష ఉంటుందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

దొంగల చేతివాటం.. రూ.50వేలు తస్కరణ


చౌటుప్పల్ టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో శుక్రవారం మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న సమయంలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. మునిసిపాలిటీలోని లక్కారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గోపనబోయిన మహేష్‌యాదవ్ జేబునుంచి రూ.50 వేలను దొంగలు తస్కరించారు. ఒకరినొకరు నెట్టి వేసుకుంటూ వెళ్తున్న సమయంలో మహేష్ జేబు నుంచి జేబు దొంగలు డబ్బులు కాజేశారు.

మద్యం మత్తులో కత్తితో దాడి

చింతపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యువకుడిపై దాడి రిగింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని గొడకొండ్ల గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. గొడకొండ్ల గ్రామపంచాయతీలోని వెంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన పద్మ సాయికృష్ణ, అతని స్నేహితులతో కలిసి హైదరాబాద్‌లో ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తున్నాడు. దసరా పండుగను పురస్కరించుకొని సాయికృష్ణ వెంకటేశ్వరనగర్‌కు వచ్చారు. కాగా మండలంలోని గొడకొండ్ల గ్రామానికి చెందిన నూరు సత్తయ్య కుమారుడు మధు బైక్ పాయింట్‌లో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. దసరా వేడుకలు పూర్తి చేసుకొని రాత్రి 10 గంటల సమయంలో మధు భోజనం చేసిన తర్వాత స్నేహితులతో మాట్లాడుతున్నాడు. ఇంతలో వెంకటేశ్వరనగర్‌కు చెందిన సాయికృష్ణ బైక్‌పై అదే గ్రామానికి చెందిన గడ్డం శ్రీకాంత్‌ను కలవడానికి వచ్చాడు. మధు, స్నేహితులతో మట్లాడుతున్న క్రమంలో మద్యం మత్తులో ఉన్న సాయికృష్ణ మధుతో మాట్లాడుతూ మాటకు మాటకు పెరిగింది. సాయికృష్ణ కత్తితో మధు కడుపులో పొడిచాడు. మధుకు తీవ్ర రక్తస్రావం కావడంతో వెంటనే కిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మధు మామ రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నెలవారీ విద్యుత్ బిల్లు రూ.9,77,157

● యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరులో ఘటన



వెల్పుల ఉప్పలయ్యకు ఇచ్చిన విద్యుత్ బిల్లు

మోటకొండూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరులో ఓ వినియోగదారుడికి నెలవారీగా రూ.9,77,157 విద్యుత్ బిల్లు వచ్చింది. మోటకొండూరు మండలం పెద్దబావి మధిర గ్రామం చాకంపల్లి గ్రామానికి చెందిన రైతు వెల్పుల ఉప్పలయ్య ఇంట్లో ఐదు లైట్లు, మూడు ఫ్యాన్లు, ఫ్రిజ్ ఉన్నాయి. విద్యుత్ వినియోగానికి సంబంధించి ప్రతి నెల రూ.300 నుంచి రూ. 600 వరకు కరెంట్ బిల్లు వస్తుంది. ఈ నేపథ్యంలో గత నెల 2వ తేదీ నుంచి ఈ నెల 3వ తేదీ వరకు విద్యుత్ వినియోగానికి సంబంధించి శుక్రవారం మీటర్ రీడింగ్ తీశారు. 97,279 యూనిట్ల వినియోగానికి రూ.9,77,157 బిల్లు చెల్లించాలని సిబ్బంది రశీదు ఇచ్చారు. దీంతో వినియోగదారుడు సిబ్బందిని ప్రశ్నించగా, పై అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.


యాదగిరిగుట్ట ఆలయంలో


భువనగిరిలో రావణాసుర బొమ్మ దహనం కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు


నేరేడుచర్లలో జమ్మిచెట్టు వద్ద పూజలు చేస్తున్న ప్రజలు

ఉత్సాహంగా వేడుక

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విజయదశమి వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. పండుగ సందర్భంగా ఆలయాలకు వెళ్లి దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ శివారులో ఆలయాల వద్ద జమ్మి చెట్టుకు పూజలు నిర్వహించారు. పాలపిట్ట చూసి ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కొన్ని చోట్ల రాంలీలా వేడుకలు నిర్వహించారు. భారీ లైటింగ్, డీజేలతో ఆ ప్రాంతమంతా కోలాహలం మారింది.


దసరా వేడుకల్లో పాల్గొన్న మాజీమంత్రి జగదీష్‌రెడ్డి దంపతులు


మఠంపల్లిలో శోభాయాత్రలో పాల్గొన్న వేషధారులు


తుంగతుర్తిలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న భక్తులు


నకిరేకల్‌లో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం దంపతులు


నల్లగొండలో రావణాసుర బొమ్మ దహనం చేస్తున్న నాయకులు

సీఎంఆర్ చెక్కుల మాయాజాలం

● రూ.20లక్షలు గోల్‌మాల్ ● మాజీ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటరే సూత్రధారి ● పోలీసుల అదుపులో నిందితుడు?

హుజూర్‌నగర్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఆసరా అవుతున్న పథకాలు దళారులకు కాసులు కురిపిస్తున్నాయి. సీఎంఆర్ చెక్కుల మంజూరులో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయి. లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను వేరొకరి పేరు మీద మార్చి అక్రమాలకు పాల్పడినట్లు బట్టబయలైంది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని మేళ్లచెరువు మండలం రామాపురానికి చెందిన లబ్ధిదారుడికి అందాల్సిన సీఎంఆర్ చెక్కు మరొక వ్యక్తి పేరు మార్చి నిధులు డ్రా చేయడంతో అక్రమాలు వెలుగుచుశాయి. హుజూర్‌నగర్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన వ్యక్తి సీఎంఆర్ చెక్కుల మాయాజాలంలో కీలక పాత్ర పోషించినట్లు తెలుస్తోంది. 2019 నుంచి 2023 వరకు బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మాజీ ఎమ్మెల్యే వద్ద కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన వ్యక్తి సీఎంఆర్ చెక్కులను ఒకరి పేరుమీద మంజూరు కాగా అదే పేరున్న వ్యక్తి డ్రా చేసి నిధులు స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి. నాలుగేళ్లలో సుమారు రూ.20లక్షల వరకు చెక్కులను మార్చినట్లు విమర్శలు వినిస్తున్నాయి. ఇటీవల మేళ్లచెర్వు మండలం రామాపురానికి చెందిన మద్ద వెంకటేశ్వర్లుకు వచ్చిన సీఎంఆర్ చెక్కు రూ.2.50 లక్షలు బ్యాంక్ ఆఫ్ బరోడాలో మరో వ్యక్తి పేరుతో నిధులు డ్రా చేసినట్లు గుర్తించారు.

దీంతో బాధితుడు మేళ్లచెర్వు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయం వెలుగు చూసింది. కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోనికి తీసుకొని విచారణ చేస్తున్నా రు. నాలుగు రోజుల క్రితం కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేసిన వ్యక్తిని అరెస్టు చేసి పూర్తి వివరాలను రాబడుతున్నట్లు సమాచారం. నియోజకవర్గంలో నాలుగేళ్లలో మంజూరైన చెక్కుల వివరాలు, లబ్ధిదారుల జాబితాను ఆరా తీసున్నారు.

రక్షించేందుకు వెళ్లి.. నీటి ఉధృతికి గల్లంతై

● సాగర్ బ్యాక్ వాటర్‌లో మునిగి ముగ్గురు మృతి ● నల్లగొండ జిల్లాలో పండుగ వేళ విషాదం ● మృతులు ఆంధ్రప్రదేశ్‌వాసులు




ఉమసాయికాంత్, రాంనాయక్, భరత్‌నాయక్


రాంనాయక్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

చందంపేట, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయదశమి పండుగకు స్వగ్రామానికి వచ్చిన ముగ్గురు విగతజీవులయ్యారు. నల్లగొండ జిల్లా చందంపేట మండలం దేవరచర్లలో ఈ విషాదం నెలకొంది. చందంపేట ఎస్‌ఐ లోకేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దేవరచర్లకు చెందిన ఉమసాయికాంత్(11), భరత్‌నాయక్(22), రాంనాయక్(25) అంధ్రప్ర దేశ్ రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో కుటుంబ సభ్యులతో నివసిస్తున్నా రు. ఉమసాయికాంత్ కృష్ణా జిల్లా అవనిగడ్డలో ఐదో తరగతి, భరత్ నాయక్ మచిలిపట్నంలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతుండగా, రాంనాయక్ తెనాలిలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. వీరు దసరా పండుగకు స్వగ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చారు. గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న సాగర్ బ్యాక్ వాటర్‌లో ఈత కొట్టేందుకు వెళ్లారు. స్నానానికి దిగిన ఉమసాయికాంత్ నీటిలో గల్లంతవటంతో గమనించిన భరత్‌నాయక్, రాంనాయక్‌లు రక్షించేందుకు దిగి నీటి ఉధృతికి గల్లంతయ్యారు. అక్కడే ఉన్న స్థానికులు పోలీసులకు సమాచారమివ్వటంతో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టి భరత్‌నాయక్, రాంనాయక్ మృతదేహాలను వెలికితీశారు. ఉమసాయికాంత్ మృతదేహాన్ని శుక్రవారం ఉదయం లభించింది. పండుగకు వచ్చిన ముగ్గురు నీట మునిగి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ లోకేష్ తెలిపారు.

నీటి సంపులో పడి బాలుడు..

కనగల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నీటి సంపులో పడి బాలుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని పగిడిమర్రి గ్రామంలో జరిగింది. బంధువులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఇటికాల రాము, శ్రీలత దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు హర్షద్‌రామ్(3) శుక్రవారం మధ్యాహ్నం బొమ్మ పిస్తోలుతో ఆడుతుండగా ఇంటి ఆవరణలోని నీటి సంపులో ఆ పిస్తోలు పడింది. దానిని బయటకు తీసే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో పడి ఊపిరాడక మృతిచెందాడు. ఇంట్లో ఉన్న బాలుడి తల్లిదండ్రులు పావు గంట తర్వాత బయటకి రాగా కుమారుడు నీటి సంపులో పడి ఉండటాన్ని గమనించి బయటకి తీశారు. అప్పటికే బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. కుమారుడి మృతితో తల్లిదండ్రులు బోరున విలపించారు. అప్పటి దాకా ఆడుకున్న బాలుడు మృత్యువాత పడడంతో వారి రోదనలు మిన్నంటాయి.


హర్షద్‌రామ్(ఫైల్)

పండుటాకులకు అండగా..

● వృద్ధులకు చేయూతనిస్తున్న పోలీసులు


మల్లాపురంలో వృద్ధురాలికి కిట్ అందజేస్తున్న ఏసీపీ, సీఐ



యాదగిరిగుట్ట రూరల్ అక్టోబరు 3,(ఆంధ్రజ్యోతి): దిక్కుమొక్కు లేకుండా దీనస్థితిలో చివరి రోజులు గడుపుతున్న వృద్ధులకు పోలీసులు అండగా నిలుస్తున్నారు. తమ పిల్లల సంరక్షణను కోల్పోయిన అనాథ వృద్ధులకు తోడ్పాటు అందిస్తున్నారు. గోల్డెన్‌కేర్ ఆసరాతో అనాథ వృద్ధుల కోసం చేయూత అందిస్తున్నారు. వైద్యం, మందులు, దుస్తులు, ఆహారం, ఆర్థిక సహకారం అందిస్తూ ఉదారత చాటుకుంటున్నారు యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో వివిధ స్థాయిలో పనిచేస్తున్న పోలీసులు. యాదగిరిగుట్ట పట్టణ, మండలంలోని పాతగుట్ట, శ్రీరాంనగర్, ఇందిరానగర్, వంగపల్లి, మల్లాపురం గ్రామాల్లో ఇప్పటి వరకు సుమారు 20మంది అనాథ వృద్ధులకు ఆర్థిక సాయం, దుస్తులు, వైద్యం, మందులు, దుప్పట్లు అందజేశారు. చివరి దశలో కాలం గడుతుపుతున్న తల్లిదండ్రులను తమ తమ పిల్లలు అన్ని విధాలుగా సక్రమంగా చూసుకోవాలని, వారిని ఎలాంటి ఇబ్బందులకు చేయొద్దని వృద్ధుల కుటుంబ సభ్యులకు పోలీసు ఉన్నతాధికారులు కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

పోలీసులు ఆహారం అందించడం సంతోషంగా ఉంది

పోలీసు అధికారులు అహారం అందించడం సంతోషంగా ఉంది. తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టవద్దని వారికి చెప్పి వారికి బాధ్యతను గుర్తుచేస్తున్నారు. మాకు అండగా ఉంటూ భరోసా ఇవ్వడంతో మనసు కుదుటపడింది. ● రాజమ్మ, వంగపల్లి.


తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేయొద్దు



నవమాసాలు మోసి కని, పెంచిన తల్లిదండ్రులను వృద్ధాప్య దశలో ఇబ్బందుపెడితే కఠిన చర్యలు తీసుకుంటాం. వారికి కావల్సిన వైద్యం, మందులు, సమయానికి ఆహారం అందించాల్సిన బాధ్యత వారి పిల్లలదే. తల్లిదండ్రులను ఇబ్బందులు పెట్టే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి నూతన చట్టాలు వచ్చాయి. ● శ్రీనివాస్‌నాయుడు, యాదగిరిగుట్ట ఏసీపీ.

ప్రమాదం జరిగితే..

● జనావాసాల మధ్య టపాసుల విక్రయాలు ● అనుమతులు లేకుండా బహుళ అంతస్తులో దుకాణాల ఏర్పాటు


నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఓ బహుళ అంతస్తులో ఏర్పాటు చేసిన బాణాసంచా దుకాణం

టపాసుల విక్రయాల్లో నిబంధనలకు పాతరేస్తున్నారు. వ్యాపారులు ఇష్టారీతిగా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. టపాసుల దుకాణాల ఏర్పాటుకు రెవెన్యూ, మునిసిపాలిటీ, పోలీస్, అగ్నిమాపక శాఖల అనుమతులు తప్పనిసరి. వ్యాపారులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. వచ్చిన దరఖాస్తులు, అందులో సూచించిన స్థలాన్ని భౌతికంగా పరిశీలించి అనుమతులు జారీ చేయాల్సి ఉంది.

నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని హను మాన్‌పేట ఫ్లై ఓవర్ వంతెనకు సమీపంలో జనావాసాలకు ఆనుకొని ఓ టపాసుల దుకాణం ఏర్పాటైంది. ఈ దుకాణం ఏర్పాటుకు అధికారుల నుంచి అనుమతులు పొందకుండానే బహుళ అంతస్తు భవనం ఫస్ట్ ఫ్లోర్‌లో భారీగా బాణాసంచా డంపు చేసి విక్రయాలు సాగిస్తున్నారు. అధికారులకు కన్పిస్తున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. ఇదే తరహాలో జిల్లాలోని పలు ప్రాంతాల్లో టపాసుల విక్రయ కేంద్రాలు వెలుస్తున్నాయి. జనావాసాల మధ్య ఏర్పాటైన టపాసుల విక్రయ కేంద్రాలను తొలగించాలని అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిర్యాలగూడ పట్టణంలోని ఫ్లై ఓవర్ వంతెనకు సమీపంలో ఏర్పాటైన టపాసుల దుకాణానికి అత్యంత సమీపంలో పలు రకాల వాహనాల షోరూం, జనావాసాలు విస్తరించి ఉన్నాయి.

దుకాణాలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం

టపాసుల విక్రయాల కోసం పలువురు వ్యాపారులు దరఖాస్తు చేసుకున్నారు. స్థల పరిశీలన చేసిన తర్వాత లైసెన్స్ పత్రాలు జారీ చేస్తాం. అనుమతులు పొందకుండా ఏర్పాటైన దుకాణాలను పరిశీలించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ వంతెన సమీపంలో ఏర్పాటైన బాణాసంచా దుకాణంపై ఫిర్యాదు వస్తున్నాయి. ఇతర శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటాం.

● యాదగిరి, ఎఫ్ఎస్‌వో, మిర్యాలగూడ.

పాతగుట్ట రోడ్డుకు అడ్డుకట్ట

● పరిహారం ఇస్తేనే సహకరిస్తాం : బాధితులు ● నిలిచిన రోడ్డు విస్తరణ పనులు



పాతగుట్ట రోడ్డు

యాదగిరిగుట్ట రూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణం నుంచి పాతగుట్టకు వెళ్లే రోడ్డు పనులకు ఆదిలోనే అడ్డుకట్ట పడుతోంది. గుట్ట చౌరస్తా నుంచి పాతగుట్ట వరకు సుమారు రెండు కిలో మీటర్ల బీటీ రోడ్డును 15సంవత్సరాల క్రితం నిర్మించారు. అప్పటినుంచి ప్రతిరోజూ టాంగాలతో పాటు పాతగుట్టకు వెళ్లే భక్తులు, అదే రోడ్డు వెంట 10గ్రామాలకు ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు. ప్రస్తుతం రోడ్డు మొత్తం గుంతలు పడింది. రోడ్డు నిర్మిస్తామని గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాన చేసినా ఎన్నికలు రాగానే ఆగిపోయింది. దీంతో రోడ్డు పరిస్థితి మరింత జఠిలంగా మారింది. ప్రజలు, భక్తుల కోరిక మేరకు ప్రస్తుత ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య రోడ్డు నిర్మాణం, ఇరుపక్కలా అండర్ డ్రైనేజీ నిర్మాణానికి సుమారు రూ.5కోట్లు కేటాయించి 60మీటర్ల రోడ్డు విస్తరించి బీటీరోడ్డుగా మార్చడానికి రెండు నెలల క్రితం శంకుస్థాపన చేశారు. అధికారులు రోడ్డు విస్తరణకు హద్దులకు రెడ్‌మార్క్ చేశారు. 60పీట్ల రోడ్డు నిర్మిస్తే కొంతవరకు ఇళ్లు కోల్పోతున్నామని సుమారు 30మంది బాధితులు 40 పీట్లు రోడ్డు నిర్మించాలని వారు విప్ బీర్ల అయిలయ్య, మునిసిపల్ కమిషనర్ మిర్యాల లింగస్వామికి వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. సమస్య పరిష్కరించే వరకు విస్తరణ పనులు అడ్డుకుంటామని బాధితులు హెచ్చరిస్తున్నారు.

రోడ్డు విస్తరణ కుదించాల్సిందే : రోడ్డు విస్తరణ బాధితులు

యాదగిరిగుట్ట పట్టణ చౌరస్తా నుంచి పాతగుట్ట వరకు నిర్మించే బీటీరోడ్డు 60 పీట్ల నుంచి 40 పీట్ల వరకు కుదించాల్సిందే. 60 పీట్లు నిర్మిస్తే సుమారు ఇళ్లు తొలగించాల్సి వస్తుంది. దీంతో రోడ్డు విస్తరణ బాధితులు తీవ్రంగా నష్టపోతారు. ఒకవేళ 50 పీట్ల వరకు నిర్మాణం చేపడితే ఇళ్లు, ఇంటి స్థలానికి పూర్తి నష్టపరిహారం ఇవ్వాలి.

అభివృద్ధికి అందరూ సహకరించాలి



యాదగిరిగుట్ట పాతగుట్ట చౌరస్తా నుంచి పాతగుట్ట వరకు నిర్మించే బీటీరోడ్డు విస్తరణ అభివృద్ధి పనులకు ప్రజలు సహకరించాలి. 60 పీట్ల రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉండగా రోడ్డు విస్తరణ బాధితుల కోరిక మేరకు 50పీట్ల వరకు కుదించాం. రోడ్డును అడుకోకుండా బాధితులు వారికి ఇబ్బందులు కాకుండా పనులు చేపడతాం. ● బీర్ల అయిలయ్య, విప్

ప్రజా సంక్షేమమే శ్వాసగా..ధ్యాసగా..

- శ్రీరాంసాగర్ జలాల కోసం అలుపెరగని పోరాటం
- తెలంగాణ సాధన కోసం తనవంతుగా ....



దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ చేపట్టిన పాదయాత్రలో వైఎస్ఆర్‌తో కలిసి భోజనం చేస్తున్న దామన్న (ఫైల్)

(ఆంధ్రజ్యోతి,సూర్యాపేట (కలెక్టరేట్)

సూర్యాపేట జిల్లా అభివృద్ధికి మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి విశేష కృషి చేశారు. ఏదైనా విషయంపై పట్టుబడితే అది సాధించే వరకు విశ్రమించరు. 1980లో కమ్యూనిస్టులకు కంచుకోటగా ఉన్న తుంగతుర్తి నియోజకవర్గం లో ఫ్యాక్షన్ రాజకీయాలు అధికంగా ఉండేవి. కాంగ్రెస్ నుంచి ఎవరూ పోటీ చేసినా విజయం సాధించేవారు కాదు. 1985 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గం నుంచి దామోదర్‌రెడ్డికి టికెట్ ఇవ్వడంతో ఆయన కమ్యూనిస్టులపై విజయం సాధించారు. ఆయన పర్యటన సమయంలో తుంగతుర్తి సాగునీరు సరిగా లేక వ్యవసాయ భూములు పడావు ఉండడం గుర్తించి దానికి పరిష్కార మార్గం శ్రీరాంసాగర్ రెండో దశ అని గుర్తించాడు. తుంగతుర్తి నియోజకవర్గానికి శ్రీరాంసాగర్ జలాలు తీసుకరావడంలో ప్రధాన భూమిక పోషించారు. 1996 మార్చిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు తిరుమలగిరి మండల కేంద్రంలో ప్రగతి నగర్ వద్ద ఎస్సారెస్పీ కాల్వలకోసం శంకుస్థాపన చేసి శిలాఫలకం వేశారు. ఆ తర్వాత నిధులు మంజూరు చేయకుండా కాలయాపన చేయడంతో శ్రీరాంసాగర్ జలాల కోసం పోరాడుతున్న దామోదర్‌రెడ్డి 2001 డిసెంబర్‌లో మొక్కలు నాటి నిరసన వ్యక్తం చేశారు. 2002లో సుమారు పది వేల మంది రైతులను సమీకరించి ప్రగతినగర్‌లో ఎస్సారెస్పీ కాల్వల శిలాఫలకం వద్ద దామోదర్‌రెడ్డి స్వయంగా రక్త తర్పణం చేశారు. అలా పోరాడి ఎస్సారెస్పీ కాల్వ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించి 2009 అసెంబ్లీ ఎన్నికలకు ముందు తిరుమలగిరి మండలం వెలిశాల వద్ద అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేత శ్రీరాంసాగర్ జలాలు విడుదల చేయించారు. తెలంగాణ ఏర్పాటు కావాలని, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు విద్య, ఉద్యోగ, నీటి రంగాల్లో జరుగుతున్న అన్యాయాలపై అసెంబ్లీలో దామన్న గళమెత్తారు. అంతే కాకుండా కాంగ్రెస్ నాయకులు చిన్నారెడ్డి, మరికొంత ఎమ్మెల్యేలు, నాయకులు కలిసి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్ర చేపట్టారు. 2009లో తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా దామన్న కాంగ్రెస్ నుంచి ప్రతినిధిగా ఉండి ఢిల్లీలో ఏఐసీసీ నాయకుల వద్ద తెలంగాణ ఏర్పాటు గురించి మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డితో పాటు డిమాండ్ చేశారు.

దామన్నకు ప్రముఖుల నివాళి..

హైదరాబాద్‌లో బుధవారం రాత్రి మృతి చెందిన దామోదర్‌రెడ్డి మృతదేహాన్ని జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ఉంచారు. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్‌యాదవ్, రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి మృతదేహాలకు నివాళులర్పించారు. అలాగే దామోదర్‌రెడ్డి కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డిని ఓదార్చి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం దామన్న పార్థీవదేహం హైదరాబాద్ నుంచి సూర్యాపేటకు తరలిస్తున్న సమయంలో అడుగడుగునా ఆయన అభిమానులు, కాం గ్రెస్ శ్రేణులు నివాళులర్పించారు. నకిరేకల్‌లో ఎమ్మె ల్యే వేముల వీరేశందామన్న భౌతికకాయంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. శుక్రవారం సాయ ంత్రం నుంచి రాత్రి వరకు సూర్యాపేటలో ప్రజల సందర్శనార్థం దామన్న భౌతికకాయాన్ని ఉంచారు. రాత్రి తుంగతుర్తికి తరలించారు.

దామన్న మాటతో మావోయిస్టులు జనస్రవంతిలోకి..

తెలంగాణలోని ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎంతోమంది విప్లవభావాలతో మావోయిస్టు ఉద్యమంలోకి వెళ్లారు. అలాంటి సమయంలో ఎంతో మంది మావోయిస్టులతో మాట్లాడి తుపాకులతో సమాజంలో మార్పు తేవడం సాధ్యం కాదని వారికి అవగాహన కల్పించారు. దీంతో చాలామంది దామన్న మాటలకు మార్పు చెందిన జనజీవన స్రవంతిలో కలిశారు. అందులో ఆలేరు నుంచి రఘుపతిరెడ్డి, మోతె మండలం రావిపహాడ్ నుంచి అనంతరెడ్డి, తుంగతుర్తి మండలం వెలుగుపల్లి నుంచి గుడిపాటి నర్సయ్యతో పాటు మరికొంత మంది ఉన్నారు.

సూర్యాపేట, తుంగతుర్తిలో పార్టీ శ్రేణులకు రక్షణగా

తుంగతుర్తి నియోజకవర్గంలో 1980లో గ్రామాల్లో ఎక్కువగా కమ్యూనిస్టులు, టీడీపీ, కాంగ్రెస్‌ల మధ్య పెద్దఎత్తున ఘర్షణలతో అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు హత్యకు గురయ్యే వారు. దామన్న 1985లో తుంగతుర్తిలో పోటీ చేసి విజయం సాధించడంతో కాంగ్రెస్ శ్రేణులకు అండ లభించింది. నాటి నుంచి నేటి వరకు ఆ నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులకు అండగా నిలుస్తూ వచ్చారు. నియోజకవర్గం రిజర్వేషన్ మారి సూర్యాపేటకు వచ్చిన తర్వాత కూడా తుంగతుర్తి ప్రజలతో అనుబంధాన్ని కొనసాగించారు.

నేడు అంతిమ యాత్రకు ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

తుంగతుర్తి : మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి అంతిమ యాత్రకు తుంగతుర్తిలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఆర్డీవో వేణుమాధవ్, డీఎస్పీ ప్రసన్న కుమార్ శుక్రవారం వ్యవసాయ క్షేత్రంలోని ఆయిల్ పంప్ సాగు తోటలో మహాప్రస్థానం స్థలాన్ని పరిశీలించారు పరిసర ప్రాంతాల్లో మట్టిని చదును చేస్తున్నారు. శనివారం ఉద యం పది గంటలకు అధికార లాంఛనాలతో దామన్నకు అంత్యక్రియలు నిర్వహించనున్నారు. దామన్నకు తనకు జీపులు, కార్లు నడపాలంటే ఇష్టంగా ఉండేది. తన వ్యవసాయ క్షేత్రంలో తిరగ డానికి తానే స్వయంగా జీపున నడుపుకుంటూ పంట ను పరిశీలించేవారు.

తనయుడిని ప్రజాప్రతినిధిని చేయాలనుకుని..



మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి సుమారు 45ఏళ్ల పాటు సుదీర్ఘ కాలం రాజకీయాల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఆయన అనంతరం ఆయన వారసుడు సర్వోత్తమ్‌రెడ్డిని కూడా ప్రజాప్రతినిధిగా చేయాలని భావించాడు. అందులో భాగంగా 2009, 2014 లో కాంగ్రెస్ నుంచి భువనగిరి ఎంపీగా టికెట్ కోసం తీవ్ర ప్రయత్నం చేశారు. పలు సమీకరణాల కారణంగా టికెట్ లభించలేదు.

భుజానికి బ్యాగు సెంటిమెంట్

సాధారణంగా దామోదర్‌రెడ్డి ఎన్నికల సమయం వచ్చిందంటే మాత్రం తన భుజానికి ఒక ప్రత్యేకమైన బ్యాగును వేసుకోవడం సెంటిమెంట్‌గా భావించేవారు. రోజు ఎలాంటి బ్యాగులు లేకుండా ఉండే దామన్న మాత్రం ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాగానే కచ్చితంగా బ్యాగును మాత్రం భుజానికి వేసుకుంటారు.

'తుంగతుర్తి'తో విడదీయరాని అనుబంధం

మోత్కూరు : మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతితో తుంగతుర్తి నియోజకవర్గం విషాదంలో మునిగిపోయింది. దామన్న ఐదు పర్యాయాలు ఎమ్మెల్యే, రెండు సార్లు మంత్రిగా పని చేసి కూడా పెద్దలు ఇచ్చిన వేల ఎకరాల భూమిని (ఆస్తిని) అమ్మి పార్టీని, కార్యకర్తలను కా పాడుకున్నాడే తప్ప ఆస్తులు సంపాదించలేదు. దామోదర్‌రెడ్డి హయాంలోనే తుంగతుర్తి నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి రోడ్డు వేయించారు. తొమ్మిది విద్యుత్ సబ్‌స్టేషన్లు, 23 జడ్పీ ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేయించారు. పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయించారు.2009లో నియోజకవర్గాల పునర్విభజనలో తుంగతుర్తి నియోజకవర్గం ఎస్సీ రిజర్వుడు కావడంతో ఆయన సూర్యాపేటకు వెళ్లినప్పటికీ తుంగతుర్తిలో ఆయన ప్రాముఖ్యత తగ్గలేదు. ఉమ్మడి మోత్కూరు మండలం కోటమర్తి గ్రామ దేశ్‌ముఖ్ కౌసల్యాదేవి కూతురు వరూధినిదేవిని ఆయన వివాహమాడారు. కౌసల్యాదేవికి కుమారు లు లేకపోవడం, పెద్దకూతురు వివాహం చేసుకుని విదేశాల్లో ఉండటంతో కౌసల్యాదేవి ఆస్తి కూడా ఆయనకే రావడంతో ఆయన తరచుగా ఈ ప్రాంతానికి వచ్చి వెళ్లేవారు. కోటమర్తిలో వందల ఎకరాల భూమి ఉండగా ప్రస్తుతం పది ఎకరాలు మాత్రమే మిగిలింది.

రూ.2 లక్షలు పలికిన దుర్గాదేవి లడ్డూ



లడ్డూను తీసుకెళ్తున్న రమేష్ కుటుంబ సభ్యులు, నిర్వాహకులు

చిట్యాలరూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఆరెగూడెంలో కనకదుర్గ అమ్మవారి లడ్డూ శుక్రవారం వేలం వేశారు. గ్రామంలో స్థానికుడు అరూరి గోపాల్ రూ. 2,0500,16 లక్షలకు వేలం పాడి లడ్డూను దక్కించుకున్నారు. అన ంతరం అమ్మవారి ప్రతిమను ని మజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో సంతోష్, జోగు రా జు, సంద్యాల వినయ్, జంంజు వెంకటేష్, గజ్జలల కిరణ్, ఎడ్లె విఘ్నేష్, జెల్లా సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

లచ్చిరామ్‌కు గ్లోబల్ పీస్ అవార్డు



మర్రిగూడ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలోని మర్రిగూడ మండ లం దామెర భీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న డాక్టర్ ఉదావత్ లచ్చిరాంకు మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని భారత్ బ్రాండ్ బుక్ ఆఫ్ రికార్డ్ న్యూఢిల్లీ సీఈవో డీకె.రాజ్ శుక్రవారం ఆన్‌లైన్‌లో గ్లోబల్ పీస్ అవార్డు 2025 అవార్డు సర్టిఫికెట్ అందించారు. అహింసా మార్గాన్ని విద్యార్థులకు బోధించడంలో కృషి చేయడం వంటి వాటిని పరిగణలో తీసుకొని లచ్చిరామ్‌కు ఈ అవార్డును అందజేసినట్లు సంస్థ నిర్వాహకులు ప్రకటించారు.

జడ్పీ పీఠం అధిష్ఠించేదెవరో..?

(5వ పేజీ తరువాయి)

ఈమెను బరిలో దించే అవకాశాలున్నట్లు చెబుతున్నారు.

సూర్యాపేటలో జడ్పీ పీఠం ఎక్కనున్న బీసీ నేత

అధికార, ప్రతిపక్ష పార్టీలు పోటాపోటీగా ఉన్న సూర్యాపేట జిల్లాలో జడ్పీ పీఠం బీసీలకు రిజర్వ్ అయింది. నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి, ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గాలు రెండూ ఈ జిల్లాలోనే ఉండడంతో ఈ జిల్లాలో జడ్పీటీసీ స్థానాలకు పోటాపోటీ నెలకొనే అవకాశముంది. 23 జడ్పీటీసీ స్థానాలున్న ఈ జిల్లాలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవి బీసీలకు రిజర్వ్ చేయడంతో ఈ పదవి దక్కించుకునేందుకు బీసీ నేతలు పోటీపడుతున్నారు. ఎస్సీ, ఎస్టీలకు కేటాయించిన ఎనిమిది స్థానాలు మినహా మిగిలిన 15 స్థానాల్లో జడ్పీ చైర్మన్ పదవి ఆశించే నేతలు పోటీచేసే అవకాశం ఉండడంతో తొలుత ఎవరినీ నారాజ్ చేయకుండా జడ్పీటీసీ సభ్యులుగా బరిలో దింపుతారని, ఆ తర్వాత గెలిచిన అభ్యర్థుల ఆధారంగా చైర్మన్ అభ్యర్థిని ఎంపిక చేస్తారని భావిస్తున్నారు. బీసీలకు రిజర్వ్ చేసిన గరిడేపల్లి, కోదాడ, నడిగూడెం, పెన్‌పహాడ్, నాగారం, బీసీ మహిళలకు కేటాయించిన ఆత్మకూరు(ఎస్), చింతలపాలెం, మేళ్లచెరువు, నేరేడుచర్ల, సూర్యాపేట, జనరల్ మహిళలకు కేటాయించిన అర్వపల్లి, మఠంపల్లి, జనరల్ స్థానాలైన చిలుకూరు, చివ్వెంల, పాలకీడు స్థానాల్లో పోటీచేసి గెలిచే బీసీ నాయకులకు చైర్మన్ పదవి దక్కనుంది.

బీసీ మహిళలకు యాదాద్రి జడ్పీపీఠం

యాదాద్రి భువనగిరి జిల్లా పరిషత్ స్థానం బీసీ మహిళలకు కేటాయించారు. దీంతో ఇక్కడ బీసీలకు కేటాయించిన జడ్పీటీసీ స్థానాలతోపాటు జనరల్, జనరల్ మహిళలకు కేటాయించిన స్థానాల్లో బీసీ మహిళలు ఎవరైనా పోటీచేసి గెలుపొందితే వారిలో ఒకరికి జడ్పీ చైర్‌పర్సన్ అవకాశం దక్కనుంది. అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి ఇప్పటివరకు ఎవరికీ చైర్‌పర్సన్ పదవిపై హామీ దక్కకపోవడంతో ఆశావహులు తొలుత జడ్పీటీసీలుగా పోటీచేసేందుకు సిద్ధమవుతున్నారు. బీసీ మహిళలకు కేటాయించిన ఆలేరు, ఆత్మకూరు(ఎం), చౌటుప్పల్‌తోపాటు బీసీలకు కేటాయించిన అడ్డగూడూరు, భూదాన్‌పోచంపల్లి, గుండాల, వలిగొండ జడ్పీటీసీస్థానాలతోపాటు, జనరల్ మహిళలకు కేటాయించిన భువనగిరి, మోటకొండూరు, తుర్కపల్లి, జనరల్ కేటగిరీలో ఉన్న బీబీనగర్, సంస్థాన్‌నారాయణపురం, యాదగిరిగుట్ట జడ్పీటీసీ స్థానాల్లోనూ బీసీ మహిళలు పోటీచేసే అవకాశముంది. ఈ జడ్పీటీసీ స్థానాల నుంచి పోటీచేసే మహిళా నేతలకే జడ్పీపీఠం దక్కనుండడంతో చైర్‌పర్సన్ సీటు ఆశించే నేతలు ఇక్కడ పోటీకి అవకాశాలపై సమాలోచనలు చేస్తున్నారు. గెలుపు అవకాశాలు, స్థానిక పరిస్థితులను బేరీజు వేసుకుంటున్నారని, చివరగా పార్టీల అధిష్ఠానాలు ఎవరిని రంగంలోకి దింపుతారనే దానిపైనే పోటీ అవకాశాలు ఆధారపడి ఉంటాయని నాయకులు చెబుతున్నారు.

రిజర్వేషన్ల తారుమారుతో పలువురిలో నైరాశ్యం

గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీల అభ్యర్థులకోసం కష్టపడి పనిచేసిన పలువురు ద్వితీయశ్రేణి నాయకులు, గ్రామస్థాయి నాయకులు పలువురిలో రిజర్వేషన్ల జాబితా వెలువడ్డాక తీవ్ర నైరాశ్యం నెలకొంది. సొంత జడ్పీటీసీలు, ఎంపీపీ పదవులతోపాటు, సర్పంచ్ పదవుల రిజర్వేషన్లు తమకు పోటీచేసే అవకాశం లేకుండా చేయడంతో వీరంతా దిగాలుపడ్డారు. ప్రధానంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేల అనుచరులు, గత ఎన్నికల్లో అత్యంత క్రియాశీలకంగా పనిచేయడంతోపాటు, అభ్యర్థుల గెలుపుకోసం డబ్బు సైతం ఖర్చుపెట్టిన నేతలు స్థానిక ఎన్నికల్లో కీలక పదవులు తమకు వస్తాయనే విశ్వాసంతో ఉండగా, తాజాగా వారి ఆశలు గల్లంతయ్యాయి. జడ్పీటీసీ అభ్యర్థులుగా పోటీచేయాలని భావించిన వారి పరిస్థితి ఇలా ఉంటే ఎంపీపీ పదవులు ఆశించిన నేతలదీ దాదాపు ఇలాంటి పరిస్థితే. గ్రామాల్లో క్రియాశీలకంగా ఉన్న నాయకులకూ సర్పంచ్‌గా పోటీచేసే అవకాశం లేకుండా రిజర్వేషన్లు షాక్ ఇచ్చాయి.

ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం



ఆర్మీ జవాన్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

చిలుకూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) ఆర్మీ సైనికుడిగా 22 ఏళ్ల విశేష సేవలందించి శుక్రవారం స్వగ్రామానికి వచ్చిన బెల్లంకొండ రవికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. సూర్యాపేట జిల్లా చిలుకూరు అంజనేయ స్వామి ఆలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీగా ఊరేగింపు నిర్వహించారు. చిలుకూరు గ్రామపంచాయతీ వద్ద ఏర్పాటు అభినందన సభ చేసి ఘనంగా సన్మానించారు. 22 ఏళ్ల పాటు దేశానికి సేవలందించిన రవి ఆదర్శవంతమైన వ్యక్తి అని కొనియదారు. యువత రవిని ఆదర్శంగా తీసుకొని రక్షణ విభాగంలో పని చేసేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్థులు, ఉపాధ్యాయులు, నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



సూర్యాపేటలో మాజీ మంత్రి ఆర్డీఆర్ మృతదేహాన్ని తీసుకువస్తున్న ర్యాలీలో పాల్గొన్న నాయకులు

ఆర్డీఆర్‌కు కన్నీటి వీడ్కోలు

సూర్యాపేట టౌన్, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత రాంరెడ్డి దామోదర్‌రెడ్డి భౌతిక దేహానికి పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. శుక్రవారం హైద్రాబాద్ నుండి జిల్లా కేంద్రానికి సాయంత్రం 6గంటలకు చేరుకుంది. జిల్లా కేంద్రంలో సాయంత్రం 6గంటల నుండి రాత్రి 8:30 వరకు జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అభిమానుల, కార్యకర్తల, నాయకులు సందర్శనార్థం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఉంచారు.



కార్యకర్తలు, నాయకులకు నమస్కరిస్తున్న సర్వోత్తమ్‌రెడ్డి

ఆర్డీఆర్ మృతదేహం,





ఆర్డీఆర్ భౌతికకాయంపై కాంగ్రెస్ జెండాను కప్పుతున్న మంత్రి సీతక్క, జానారెడ్డి





ఆర్డీఆర్‌కు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రమేష్‌రెడ్డి, జగదీష్‌రెడ్డి

యాదగిరీశుడికి వైభవంగా లక్ష పుష్పార్చన



స్వామికి హారతి నివేదిస్తున్న అర్చకుడు


యాదగిరిగుట్ట, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో శుక్రవారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులను వివిధ పుష్పమాలికలు, పట్టువస్త్రాలు, బంగారు, వైజ్రవైఢూర్యాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. సాయంత్రం ప్రధానాలయంలో అమ్మవారి ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. శివాలయంలో పర్వతవర్థిని శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం శైవాగమ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 28,27,775 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇన్‌చార్జి ఈవో గుగులోతు రవినాయక్ తెలిపారు. కాగా, స్వామిని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి దర్శించుకొని గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేసి లడ్డు ప్రసాదాలను అందజేశారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు పరిసమాప్తి

యాదగిరిగుట్ట దేవస్థానం అనుబంధ శివాలయంలో దేవి శరన్నవరాత్రోత్సవాలు గురువారం మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతితో పరిసమాప్తి అయ్యాయి. శివాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమ గుండంలో పూర్ణాహుతి అనువంశిక ధర్మకర్త కుటుంబ సభ్యులు, ఇన్‌చార్జి ఈవో రవినాయక్ దంపతులు పాల్గొనగా నిర్వహించారు. వేద మంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల నడుమ 10 రోజుల పాటు రోజుకొక్క అవతారంలో పర్వతవర్థిని అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కాగా ఆలయం తూర్పు రాజగోపురం ఎదురుగా అధికారులు, భక్తుల జయజయధ్వానాల నడుమ శమీ పూజ చేశారు. కాగా స్వామివారిని సీఎం ప్రిన్సిపల్ సెక్రెటరీ వి. శేషాద్రీ కుటుంబ సమేతంగా దర్శించుకొని గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. వేద మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేయగా లడ్డు ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని ఇన్‌చార్జీ ఈవో గుగులోతు రవినాయక్ అందజేశారు.

నిత్యాన్న దానానికి రూ. 6.48లక్షల విరాళం

స్వామివారి నిత్యాన్నదానం కోసం హైదరాబాద్ జూబ్లిహిల్స్‌కు చెందిన బీ.వీ.వీ.ఎస్.ఎన్ రాజు తన మనుమడి పేరున గురువారం విరాళం ఇచ్చారు. ఈ నెల 2వ తేదీ నుంచి 10 వరకు స్వామిని దర్శించే భక్తులు అన్నదానం అందించేందుకు రూ. 6.48లక్షలు డీడీ రూపంలో ఈవోకు అందజేశారు.



శమీ పూజ నిర్వహిస్తున్న అర్చకులు

ఎన్నికల్లో పోటీ చేయడానికి నిబంధనలు ఇలా..

మోత్కూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): అధికారులు తెలిపిన సమాచారం ప్రకారంస్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి పాటించాల్సిన నియమ, నిబంధనలు ఇలా ఉన్నాయి. 18 ఏళ్లకే ఓటు హక్కు కల్గి ఉంటున్నప్పటికీ ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యుడు స్థానాలకు ఎన్నికల్లో పోటీ చేయడానికి కనీస వయస్సు 21 ఏళ్లు ఉండాలి. ఎంపీటీసీగా పోటీ చేసే అభ్యర్థి ఆ మండంలోని ఏ గ్రామం నుంచైనా ఓటరు అయి ఉండవచ్చు. కాని అతన్ని ప్రతిపాదించే వ్యక్తి ఆ ఎంపీటీసీ పరిధిలోని ఓటరై ఉండాలి. జడ్పీటీసీగా పోటీ చేసే అభ్యర్థి జిల్లాలో ఏ గ్రామం నుంచి అయినా ఓటరు అయి ఉండవచ్చు. కానీ ప్రతిపాదించే వ్యక్తి ఆయన పోటీ చేస్తున్న ఆ మండల జడ్పీటీసీ పరిధిలోని ఓటరై ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, స్థానిక సంస్థల ఉద్యోగులు తమ ఉద్యోగానికి రాజీనామా చేసి పోటీ చేయాలి. నామినేషన్ల పరిశీల న నాటికి అతను ఉద్యోగానికి చేసిన రాజీనామా ఆమోదం పొందినట్టుగా ధ్రువపత్రం చూపాలి. రేషన్ దుకాణం డీలర్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయవచ్చు. అంగన్‌వాడి టీచర్, ఆయా ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హురాలు. 2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అంగన్‌వాడీ వర్కర్ అనర్హులని తీర్పు చెప్పింది. ట్రస్ట్‌బోర్డు, చారిటబుల్ సభ్యులు, చైర్మన్, మత సంస్థల్లోని సభ్యులు పోటీ చేయడానికి అనర్హులు. అభ్యర్థి గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చు. నామినేషన్ వేసిన వ్యక్తి తన నామినేషన్‌ను ఉపసంహరణల గడువులోగా ఉపసంహరించుకోవచ్చు. లేదా. అతన్ని ప్రతిపాదించిన వ్యక్తి కూడా ఉపసంహరించుకోవచ్చు. బ్యాలెట్ పేపరులో వరుసగా జాతీయ, ప్రాంతీయ పార్టీలు, ఇతర రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన పార్టీలు, రిజిస్టర్డ్ సింబల్ రిజర్వు అయిన పార్టీలు, సింబల్ లేని రిజిస్టర్డ్ పార్టీలు, తర్వాత స్వతంత్ర అభ్యర్థుల గుర్తులు ఉంటాయి.జడ్పీటీసీగా పోటీ చేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.2,500, ఇతరులు రూ.5 వేలు, ఎంపీటీసీలుగా పోటీ చేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ.1,250, ఇతరులు 2,500 డిపాజిట్ చెల్లించాలి. ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తికి రెండు చోట్ల ఓటు ఉన్నప్పటికీ పోటీ చేయవచ్చు.

వైభవంగా ఏకాదశి యజ్ఞం

కట్టంగూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో తృతీయ వార్షిక ఏకాదశి మహా యజ్ఞాన్ని శుక్రవారం ఆలయ పూజారి రామడుగు శ్రీనివాసశర్మ శశిరేఖ దంపతుల ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు అభిషేకాలు, యజ్ఞం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడవేరు శ్రీకాంత్‌జ్యోతి, గుడిపాటి పద్మ, కొత్త శోభ, కొంపెల్లి మంగమ్మ, మూడుదుడ్ల అండాలు, చెరుకు శంకరమ్మ, ఇల్లెందుల మణెమ్మ, సుజాత, ప్రవళిక, మహాలక్ష్మి పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలతో రథం ప్రారంభం

నార్కట్‌పల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లిలోని వారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానానికి రేపాల భాస్కర్‌అలివేలుమంగమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు బహూకరించిన రథాన్ని ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. అర్చకులు కారంపూడి కృష్ణమాచార్యులు, వేణాచార్యులు వేణుగోపాలస్వామి ఉత్సవమూర్తులను రథంపై అధిష్టింపజేసి ఊరేగించారు. ఈ వేడుకలో దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దోసపాటి ప్రసాద్, రమేష్, కొండల్‌రెడ్డి, సత్తయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


నకిరేకల్‌లో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు


కేతేపల్లిలో శమీపూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు


వివేకానంద నగర్‌లో రావణ దహనం కార్యక్రమానికి హాజరైన ప్రజలు

వైభవంగా విజయదశమి వేడుకలు

● ఆలయాలకు పోటెత్తిన భక్తులు

నల్లగొండ కల్చరల్, నల్లగొండ, మునుగోడు, కేతేపల్లి, కట్టంగూరు, నార్కట్‌పల్లి, చిట్యాల, చిట్యాలరూరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ప్రజలు భక్తి శ్రద్ధలతో వేడుకలను నిర్వహించుకున్నారు. గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండగను పురస్కరించుకుని ఉదయాన్నే కొత్త దుస్తులు ధరించిన యువతీ యువకులు, పిల్లలు బాణసంచా కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. సాయంత్రం చిన్నా, పెద్దా తేడా లేకుండా గ్రామ శివారుల్లోని జమ్మి చెట్టు వద్దకు వెళ్లి శమీపూజలు చేశారు. పవిత్రమైన జమ్మి ఆకులను తీసుకుని పాలపిట్ట దర్శనం చేసుకున్నారు. జమ్మి ఆకులను తమ తోటి వారికి కొంత పంచి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

● నల్లగొండ పట్టణంలోని వీటీ కాలనీలోని శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి ఆలయంలో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పవన్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన జమ్మిచెట్టుకు శమీ పూజ సంప్రాదాయ పద్ధతిలో నిర్వహించారు. రాజరాజేశ్వరిదేవి అమ్మవారిగా అలంకరించి పూజించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకుని భక్తితో పూజించారు. దీంతో ఆలయమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మాజీ కౌన్సిలర్ రావిరాల పూజిత వెంకటేశ్వర్లు, నూకల జయపాల్‌రెడ్డి, నాగుల పల్లి శ్యాంసుందర్, మేడం ప్రభాకర్, నాగార్జున, గిరిజాకుమారి పాల్గొన్నారు. అదే విధంగా తులసీనగర్‌లోని భక్తాంజనేయస్వామి ఆలయం జరిగిన శమీపూజలో ఈవో కుశలయ్య, శేఖర్ పాల్గొన్నారు. షేర్ బంగ్లాలోని సంతోషిమాత ఆలయం, బీట్ మార్కెట్‌లోని శ్రీరామకోటి స్తూప దేవాలయం, పానగల్‌లోని ఛాయా, పచ్చల సోమేశ్వరాలయాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి. అదే విధంగా వివేకానందనగర్‌లో రావణసంహారం కార్యక్రమాన్ని నిర్వహించారు.


రామాలయం వద్ద జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు

● నల్లగొండ పట్టణంలోని 48వ వార్డులో నాగార్జున కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శమీపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి ప్రత్యేకంగా హాజరై శమీపూజను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో విజయాలు సాధించాలని కాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు నాంపల్లి మనోహర్, పారేపల్లి శ్రీనివాస్, సోమయ్య, గుండా రాము, రాజు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

● మునుగోడు పట్టణంలోని ఆర్అండ్‌బీ ఆవరణలో జమ్మి వృక్షం వద్ద సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న, వివిధ పార్టీల నాయకులు పాల్వాయి రాంరెడ్డి, జిట్టగోని యాదగిరి, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, పందుల పవిత్రశ్రీను, జితేందర్‌రెడ్డి, సైదులు పాల్గొన్నారు.

● కేతేపల్లి మండలంలోని నిర్వహించిన కార్యక్రమాల్లో నకిరేకల్ మార్కెట్ చైర్‌పర్సన్ గుత్తా మంజులమాధవరెడ్డి దంపతులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌యాదవ్, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు కోట వెంకటేశ్వరరావు, బి.కవితానరేందర్, ఎస్‌కే.నఫీస్, లతీఫ్, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● కట్టంగూరులోని పద్మశాలీ కాలనీ సమీపంలో ఉన్న ముత్యాలమ్మ ఆలయం వద్ద నిర్వహించిన శమీ పూజలో మాజీ ఎంపీపీ జెల్లా ముత్తిలింగయ్య, పలు పార్టీల నాయకులు పాల్గొని ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలు జమ్మి చెట్టును దర్శనం చేసుకొని ఆలయాల్లో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి మండలంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. జరిగాయి. పలు గ్రామాల్లో శమీ పూజలను భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. గ్రామ సంప్రదాయాలు, ఆచారాలను గౌరవిస్తూ ఆయుధ పూజలు చేశారు. అనంతరం జమ్మి పత్రాలను అందజేస్తూ పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. వాసవీభవన్‌లో అమ్మవారికి మహిళలు ఒడిబియ్యం పోశారు. పసుపుముద్దతో తయారు చేసిన అమ్మవారి దివ్యపాదాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. ఆయా గ్రామాల్లో జరిగిన దసరా వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, బత్తుల ఊశయ్య, బసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, దొండ రమేష్, ఉంద్ర లింగారెడ్డి, మేకల రాజిరెడ్డి, కృష్ణయ్య, నర్సిరెడ్డి, నవీన్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, సత్తయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● చిట్యాల మునిసిపాలిటీలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం శమీపూజలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పూజలలో మునిసిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని గ్రామాల ప్రజలు ఆనందోత్సాహాలతో నిర్వహించారు. దసరా పూజలతో ఆలయాల్లో సందడిగా మారాయి. ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.


శమిపూజలో పాల్గొన్న చాడ కిషన్‌రెడ్డి


కట్టంగూరులో దశమి పూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు


నార్కట్‌పల్లి: జువ్విగూడెంలో పాల్గొన్న బసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి

శోభాయమానంగా అమ్మవారి శోభాయాత్ర

● అమ్మవారి లడ్డూ, ఇతర వస్తుల వేలం

నల్లగొండ/నల్లగొండ కల్చరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనం ఇచ్చి విశేషంగా పూజలందుకున్న కనదుర్గ అమ్మవారి శోభాయాత్ర శుక్రవారం శోభాయమానంగా సాగింది. పట్టణంలోని పలు దేవాలయాల్లో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారిని తొమ్మిది రోజులపాటు భక్తి శ్రద్ధలతో భవాని మాతలు, భక్తులు వివిధ రూపాల్లో కొలిచారు. విజయదశమి నాడు అమ్మవారు విజయం సాధించటంతో రాజరాజేశ్వరిదేవిగా అవతరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పరవశించారు. నవరాత్రులు ముగియటంతో శుక్రవారం అమ్మవారిని భక్తితో ప్రత్యేక వాహనాల్లో ఊరేగింపుగా తీసి సమీపంలోని సమీప కాలువ, చెరువులో నిమజ్జనం చేశారు. అంతకుముందే ఆలయాలు, మండపాల్లో అమ్మవారి లడ్డు, వస్త్రాలను వేలం వేయగా, భక్తులు పోటీ పడి లడ్డును, వస్త్రాలను దక్కించుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాల్లో అమ్మవారిని ఆసీనులను చేసి వాయిద్యాల మధ్య పట్టణ పుర వీధుల గుండా శోభాయమానంగా ఊరేగించారు. దారి పొడవునా అమ్మవారికి భక్తులు నీరాజనాలు పలికారు. పట్టణంలోని బొట్టుగూడ, రామగిరి, వివేకానంద నగర్‌లోని, పాతబస్తీ, మాన్యంచల్క, పెద్దబండ, వాల్మీకినగర్, బోయవాడ, విద్యానగర్, సతీష్‌నగర్ తదితర ప్రాంతాల్లోని అమ్మవార్ల ఊరేగింపు కోలాహలంగా సాగింది.


కట్టంగూర్: మునుకుంట్లలో దుర్గామాత శోభాయాత్రలో కోలాటం చేస్తున్న మహిళలు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ నాగరత్నంరాజు

నల్లగొండ పట్టణంలోని పానగల్ రోడ్డులోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో దేవి నవరాత్రుల సందర్భంగా చివరి రోజున రాజరాజేశ్వరి అవతారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. పూజలో పీఏసీఎస్ చైర్మన్ ఆలకుట్ల నాగరత్నంరాజు, ఆలయ చైర్మన్ గుండపనేని కిషన్‌రావు, నాయకులు జూలకంటి దయకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: మండలంలోని గురజాల గ్రామంలో మాజీ వార్డు మెంబర్లు యల్మకంటి నర్సయ్య సత్యవతి, ముత్యాల శంబులింగం - పార్వతమ్మ, యల్మకంటి వెంకన్నకవిత, ముత్యాల రమేష్‌సురంబ, యల్మకంటి శ్రీకాంత్ - నవనీత దంపతులు పాల్గొన్నారు. తిరుమలరాయునిగూడెంలో ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహం వద్ద ఆర్ఎస్ఎస్ రాష్ట్ర బాధ్యుడు చాడ రమేష్ చందర్‌రెడ్డియూస్సీ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

చిట్యాలరూరల్: దేవీ శరన్నవరాత్రోత్సవాలు చిట్యాల మండలంలోని గ్రామాల్లో ఆలయాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. నిర్వాహకులు, భక్తులు విగ్రహాల వద్దకు చేరుకుని శోభాయాత్రను తిలించారు. కోలాట ప్రదర్శనలు, భజన సంకీర్తనలు ఆటా-పాటలతో శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు.

కట్టంగూరు : మండలంలోని మునుకుంట్ల, కట్టంగూరు, పరడ, ఈదులూరు, ముత్యాలమ్మగూడెం, అయిటిపాముల, చెర్వుఅన్నారంతో పాటు పలు ఏర్పాటు చేసిన దుర్గాదేవి శోభాయాత్రను భక్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.


శాలిగౌరారం: తిరుమలరాయునిగూడెంలో పూజలు చేస్తున్న చాడ రమేష్ చందర్‌రెడ్డి

గాంధీ ఆశయ సాధన కోసం కృషి చేయాలి



కట్టంగూరులో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కట్టంగూరు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎంపీపీ జెల్లా ముత్తి లింగయ్య అన్నారు. గురువారం కట్టంగూరులో లయన్స్ క్లబ్ ఆఫ్ కట్టంగూరు కింగ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు దోతులు, కండువాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చిక్కు శేఖర్, ఉపాధ్యక్షులు రెడ్డిపల్లి సాగర్, కల్లూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి గుడిపాటి శివప్రసాద్, కోశాధికారి పి.రాములు, సభ్యులు కడవేరు మల్లికార్జున్, ఐతగోని లక్ష్మీనారనాయణ, బొడ్డుపల్లి వెంకన్న, రాపోలు వెంకటేశ్వర్లు, శ్రీను, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● నార్కట్‌పల్లి: మండలంలోని పలు గ్రామాల్లో గాంధీజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. బాపు విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వాసవీభవన్‌లో ఆర్యవైశ్య సంఘం, గ్రంథాలయం వద్ద వాసవీక్లబ్, అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శి సుభాన్, బిల్లకంటి శ్రీకాంత్, ఇడుకుల్ల బిక్షమయ్య, పసునూరి శ్రీనివాస్, బండారు రమేష్, సంపత్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీకి నివాళులర్పిస్తున్న నాయకులు

శాలిగౌరారం: మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గుజిలాల్ శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి దామోదర్‌రెడ్డికి నివాళి

నకిరేకల్, అక్టోబరు3, (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మృతి చెందిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి భౌతికకాయాన్ని శుక్రవారం సూర్యాపేటకు అంబులెన్స్‌లో తీసుకెళ్తూ నకిరేకల్‌లో కొద్దిసేపు ఆపారు. నకిరేకల్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే వేముల వీరేశం భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డిని ఎమ్మెల్యే వీరేశం ఓదార్చారు. కార్యక్రమంలో ఆరుగ్యారెంటీల కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, మునిసిపల్ చైర్‌పర్సన్ చెవుగోని రజిత శ్రీనివాస్, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మహిళా కార్యదర్శి గాజుల సుకన్యశ్రీనివాస్, కౌన్సిలర్లు, నాయకులుపాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : మాజీమంత్రి దామోదర్‌రెడ్డికి నార్కట్‌పల్లి మండల నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఐతరాజు యాదయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, సమద్, బోడ శంకర్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.


సర్వోత్తమ్‌రెడ్డిని ఓదార్చుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

కోడ్ కూసింది.. ముసుగు పడింది

● పార్టీల జెండా దిమ్మెలకు ముసుగులు


కేతేపల్లిలో రాజకీయ పార్టీల జెండా దిమ్మెలకు ముసుగులు వేస్తున్న సిబ్బంది

కేతేపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో గల రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలు, పార్టీల జెండా దిమ్మెలకు ముసుగులు వేస్తున్నారు. అలాగే గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీలు పెద్ద ఎత్తున ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్మికులు బుధ, గురువారాల్లో ఇదే పనిలో నిమగ్నమయ్యారు.

ఘనంగా మైసమ్మ తొట్టెల పండుగ

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లైన్‌వాడీలో కాలనీ వాసులు గురువారం మైసమ్మ తొట్టెల పండుగను సంప్రదాయబద్ధంగా వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించి కాలనీలో ఊరేగించారు. బలిహారం, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ములకల ముత్తమ్మ, నాగలక్ష్మి, సరస్వతి, శోభన్‌కుమార్, సూర్యదత్, మోహన్, శ్రీకాంత్, ఆశ్విక పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో పోటీకి సిద్ధం: సీపీఎం


సీపీఎం నియోజకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైలం

మునుగోడు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మునుగోడు నియోజకవర్గంలోని ఎంపీటీసీ, సర్పంచుల స్థానాల్లో పోటీ చేసేందుకు సీపీఎం సిద్ధంగా ఉందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బండా శ్రీశైలం తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారం, ప్రాంత అభివృద్ధి ఏకైక ఎజెండాగా ప్రతి నిత్యం ప్రజల పక్షాన నిలిచి పోరాటాలతో ముందుకు సాగుతున్న తమ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు. ప్రజా వ్యతిరేక విధానాలతో వ్యవహరిస్తూ ప్రలోభ రాజకీయాలతో ముందుకు వచ్చే వివిధ పార్టీలకు ఓటుతో బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కర్నాటి మల్లేశం, వెల్మకన్నె మాజీ ఎంపీటీసీలు చాపల మారయ్య, గోపాల్‌రెడ్డి, మునుగోడు, మర్రిగూడ, చండూరు మండలాల పార్టీ కార్యదర్శులు సాగర్ల మల్లేష్, ఏర్పుల యాదయ్య, ధనుంజయ్‌గౌడ్, నాయకులు మిర్యాల భరత్, శ్రీను పాల్గొన్నారు.

'వడ్డెర సామాజిక వర్గానికి న్యాయం చేయాలి'

శాలిగౌరారం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లలో వడ్డెర కులానికి న్యాయం చేయాలని వడ్డెర కులం శాలిగౌరారం మండలాధ్యక్షుడు కొడదల అంజయ్య డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వడ్డెర సామాజిక వర్గానికి చట్టసభల్లో, స్థానిక సంస్థల్లో వడ్డెర కులానికి అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మా కంటే ముందున్న కులాలకు ఆర్థికంగా ఉన్నవారికి చట్టసభలో స్థానిక సంస్థల వారికే న్యాయం జరుగుతుందన్నారు. 42 శాతం రిజర్వేషన్‌లో మా కులాలకు ఎన్ని సీట్లు కేటాయిస్తారు. స్థానిక సంస్థల్లో ప్రభుత్వం వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. కులాలు, జనాభా బట్టి వారికి రిజర్వేషన్ ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో మా కులం తరపున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

'అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానపర్చిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి'


శాలిగౌరారం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా వెదురు కుప్పంలో భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి మంటలు పెట్టి అవమానపర్చిన వ్యక్తులను వెంటనే గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడుర తాటిపాముల జానయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇలాంటి పరిణామాలు దేశం, రాష్ట్రంలో మళ్లీ పునరావృతం కాకుండా ప్రభుత్వాలు వెంటనే చర్యలు తీసుకోవాలని, నిందితులను వెంటనే గుర్తించి కఠినంగా శిక్షించాలని జానయ్య డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు బట్ట సైదులు, బట్ట వీరబాబు, చింత ధనుంజయ్, బట్ట శ్రీనివాస్, బట్ట చిన సైదులు, తాటిపాముల శంకర్, హేమాద్రి, పాప రాములు పాల్గొన్నారు.

ఆర్యసమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా

విజయదశమి శోభాయాత్ర

నల్లగొండకల్చరల్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విజయదశమి సందర్భంగా రామగిరి ఆర్యసమాజ్ మందిరం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం విజయదశమి శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మాల్‌బౌలిలోని ఆర్యసమాజ్ మందిరం ఆవరణలో పర్వ యజ్ఞం, ఆయుధపూజ, ఓం ధ్వజారోహణ వంటి కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం శోభాయాత్రను ప్రారంభించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో పి.శ్రీనివాస్‌రెడ్డి శోభాయాత్ర నాయకుడుగా తలపాక, ఖండాన్ని చేతబూని ని లబడ్డారు. అక్కడి మొదలైన శోభాయాత్ర పట్టణ పురవీధుల గుండా శోభాయమానంగా సాగింది. ఊరేగింపులో చిన్నారుల విన్యాసాలు, మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్యసమాజ్ మందిరం అధ్యక్షుడు బోయనపల్లి కృష్ణారెడ్డి, కార్యదర్శి పి.గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


కోలాట ప్రదర్శనతో శోభాయాత్ర



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	587.20 (305.6242)	2,61,176	2,56,244
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.90 (4.17)	3,227.96	3,138.27
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.2906 (40.2110)	2,01,325	1,85,166

చికెన్ ధరలు | లైవ్: రూ.135 | డ్రెస్: రూ.210 | స్కిన్‌లెస్: రూ.240



నల్లగొండలోని రామాలయం వద్ద వేడుకల్లో పాల్గొన్న పట్టణవాసులు

నల్లగొండలోని వివేకానంద నగర్‌లో రావణాసుర బొమ్మను దహనం చేస్తున్న స్థానికులు

అంబరాన్నంటిన సంబరాలు

దసరా సంబరాలు అంబరాన్నంటాయి. గురువారం జిల్లా అంతటా విజయదశమిని ఉత్సాహంగా జరుపుకున్నారు. జిల్లాలోని అన్ని పట్టణాలు, గ్రామాల్లో శమీవృక్ష, ఆయుధ పూజలు చేసి ఆలయాలను సందర్శించారు. శుభసూచకంగా భావించే పాలపిట్ట దర్శనం చేసుకున్నారు. అయితే మహాత్మాగాంధీ జయంతి, దసరా ఒకేరోజు రావడంతో మద్యం, మాంసం దుకాణాలు మూసీ ఉండటంతో పలువురు ఇబ్బందులకు గురయ్యారు. కొందరు ముందుచూపుగా బుధవారం రాత్రి కొనుగోలు చేసుకున్నారు. మరికొంత మంది దసరా రోజున అధికారుల నిఘా తక్కువగా ఉండే గ్రామాల్లోని దుకాణాలను ఆశ్రయించి అధిక ధరలతో కొనుగోలు చేసి పండుగ కానిచ్చారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ కల్చరల్)

తెల్లవారుజామునుంచే సమీపంలోని ఆలయాలకు చేరుకుని ఇష్ట దైవాన్ని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. ఆలయాలన్నీ ముందు రోజే అందంగా అలంకరించారు. పట్టణంలో భారీగా బాణాసంచా కాల్చారు. చిన్నా, పెద్దా, పేద, ధనిక అనే భేదం లేకుండా స్థాయికి తగినట్లు సంబురాల్లో మునిగితేలారు. అదేవిధంగా పలు దుకాణాల యజమానులు విజయదశమి సందర్భంగా పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాలకు చేరుకుని శమీపూజలో పాల్గొన్నారు. దసరా సందర్భంగా ఆలయాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. శమీపూజలో జమ్మిచెట్టుకు భక్తులు కోర్కెలతో కూడిన పత్రాలను సమర్పించి ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని కాంక్షించారు. అనంతరం భక్తులు పాలపిట్టను దర్శించుకున్నారు.

రామాలయంలో..

నల్లగొండ పట్టణంలోని రామగిరిలోగల సీతారామచంద్రస్వామి దేవాలయంలో విజయదశమి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆవరణలో సాయంత్రం శమీపూజలు నిర్వహించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి చైతన్య దంపతులు ముఖ్య అతిథిగా హాజరై జమ్మి చెట్టుకు శమీ పూజ చేశారు. వేడుకలకు భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకుని పరవశించిపోయారు. రాత్రి 9గంటల వరకు భక్తులు వరుస క్రమంలో ఉండి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. కార్యక్రమంలో ఈశ్వరయ్య, రాజేశ్వర్‌రావు, మధుసూదన్‌రెడ్డి, ఆది నారాయణ, శ్రీనివాసాచారి తదితరులు పాల్గొన్నారు.



జడ్పీ పీఠం అధిష్ఠించేదెవరో?

స్థానిక సంస్థలకు ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో జడ్పీ చైర్మన్ పీఠాలపై ఆసక్తి నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ జడ్పీ చైర్‌పర్సన్ స్థానం ఎస్టీ మహిళకు కేటాయించగా, సూర్యాపేట చైర్మన్ పదవి బీసీలకు, యాదాద్రి భువనగిరి జిల్లా చైర్‌పర్సన్ పదవి బీసీ మహిళకు కేటాయించడంతో ఆ పదవి దక్కించుకునే నేతలు ఎవరనే చర్చ సాగుతోంది. జడ్పీ చైర్మన్ పదవి ఆశించే నేతలు తొలుత జడ్పీటీసీ సభ్యులుగా గెలుపొందాల్సి ఉండడంతో ఆశావహనేతలు సులభంగా గెలిచే స్థానంకోసం వెతుకులాట మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- ఉమ్మడి జిల్లాలో ఆసక్తికర పరిస్థితి
- నల్లగొండ చైర్‌పర్సన్ పదవికి కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్సీని బరిలో దించే అవకాశం
- సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో పావులు కదుపుతోన్న బీసీ నేతలు
- నామినేషన్లు మొదలైతేనే స్పష్టత వచ్చే అవకాశం

జడ్పీటీసీ స్థానాలకు పార్టీలపరంగా ఇంకా ఎలాంటి కసరత్తు మొదలు కాలేదు. అయితే అధికార కాంగ్రెస్‌లో జడ్పీటీసీ స్థానాలకు ప్రతీ మండలం నుంచి మూడు పేర్లను ఖరారు చేసి ఇన్‌చార్జి మంత్రి ద్వారా పీసీసీకి పంపితే, పీసీసీ అభ్యర్థుల జాబితాను ఖరారు చేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేయడంతో తొలుత జడ్పీటీసీ టిక్కెట్‌కోసం ఆ పార్టీలో ఆశావహులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ, వామపక్షాల నుంచి ఇంకా కార్యాచరణ మొదలు కాలేదు. నోటిఫికేషన్ విడుదలయ్యే 9వ తేదీనాటికి ఈ పార్టీలన్నీ తమ అభ్యర్థులను ఎంపిక చేస్తాయని నాయకులు చెబుతున్నారు.

ప్రతిష్ఠాత్మక నల్లగొండ జడ్పీ పీఠం దక్కేదెవరికో....?

ప్రస్తుతం రాష్ట్రంలోనే అతిపెద్ద జిల్లా పరిషత్‌గా ఏర్పాటైన నల్లగొండ జడ్పీ చైర్‌పర్సన్ స్థానం ఎస్టీ మహిళకు రిజర్వ్ చేశారు. ఉద్దండులైన రాజకీయ నేతలున్న ఈ జిల్లాలో ఎవరి ఆశీస్సులతో ఈ పదవి ఎవరిని వరిస్తుందోననే ఆసక్తికరమైన చర్చ రాజకీయవర్గాల్లో సాగుతోంది. జిల్లాలోని 33 జడ్పీటీసీ స్థానాలకు ఎస్టీ మహిళకు పెద్దవూర, డిండి స్థానాలు రిజర్వ్ కాగా, ఎస్టీ జనరల్‌కు దేవరకొండ, పీఏపల్లి, కొండమల్లేపల్లి స్థానాలు రిజర్వ్ అయ్యాయి. ఈ అయిదు స్థానాలతోపాటు జనరల్, జనరల్ మహిళలకు కేటాయించిన స్థానాల్లోనూ ఎస్టీ మహిళలు పోటీచేసే అవకాశం ఉండడంతో ఆ కోటాలో రిజర్వ్ అయిన అడవిదేవులపల్లి, నేరేడుగొమ్ము, చందంపేట, దామరచర్ల, తిరుమలగిరిసాగర్ సీట్లలో పోటీ చేసేందుకూ ఎస్టీ నేతలు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. అధికార పార్టీలో ఎస్టీ నేతగా కీలక భూమిక పోషించిన దివంగత మాజీ ఎమ్మెల్యే రాగ్యానాయక్ సతీమణి, మాజీ ఎమ్మెల్సీ భారతీ రాగ్యానాయక్ పేరును కాంగ్రెస్ అధిష్ఠానం జడ్పీ చైర్‌పర్సన్ అభ్యర్థిగా పరిశీలించే అవకాశముందని రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. ఈమె కొంతకాలం దేవరకొండ ఎమ్మెల్యేగా, ఆ తర్వాత ఎమ్మెల్సీగానూ పనిచేసిన నేపథ్యం ఉండడంతోపాటు, ఈమె కుమారుడు స్కైలాబ్‌నాయక్ కాంగ్రెస్‌లో క్రియాశీలకనేతగా కొనసాగుతున్న నేపథ్యంలో ఈమె పేరును పరిశీలిస్తారని భావిస్తున్నారు. సొంత మండలం దామరచర్ల, అడవిదేవులపల్లితోపాటు ఎస్టీ రిజర్వ్ అయిన దేవరకొండ నియోజకవర్గంలోని స్థానాల్లో ...

- మిగతా 7వ పేజీలో...

8వ తేదీపైనే అందరి దృష్టి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ వీటిని రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో కేసు నడుస్తున్న విషయం తెలిసిందే. ఒక వైపు కేసు ఉన్నప్పటికీ న్యాయనిపుణుల సలహాలతో రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల గెజిట్ ఇవ్వగా, రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. ఎన్నికలు జరిగి తీరుతాయనే విశ్వాసంతో కాంగ్రెస్ ఎన్నికలకు సన్నద్ధమవుతుంటే, విపక్షాలు మాత్రం 8వ తేదీ వరకు వేచి చూస్తున్నట్లు కనిపిస్తోంది. 42 శాతం రిజర్వేషన్లను హైకోర్టు ప్రత్యేక ధర్మాసనం కొట్టివేస్తే ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే అంశంపైనా అందరిలో ఉత్కంఠ కొనసాగుతోంది. కోర్టు కేసు నేపథ్యంలోనే ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటికీ ఎన్నికల్లో పోటీచేయాలని భావించే నాయకులు ఎవరు కూడా దసరా సందర్భంగా ఎలాంటి హడావిడి చేయలేదు. పలువురు ఆశావహులు ఫోన్లకు సైతం స్పందించకుండా దూరంగా ఉన్నారు. 9న నోటిఫికేషన్ రానుండడం, 8వ తేదీన హైకోర్టు విచారణ తర్వాత వచ్చే మార్గదర్శకాలకనుగుణంగా ముందుకు సాగాలని రాజకీయ నాయకులు భావిస్తున్నారు.

ప్రజా సంక్షేమమే...

శ్వాసగా..ధ్యాసగా

7

(ఆంధ్రజ్యోతి,సూర్యాపేట, సూర్యాపేట-కలెక్టరేట్)

సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలే కాకుండా ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధిలో మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి తనదైన ముద్రవేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రెండుసార్లు మంత్రిగా పని చేసిన ఆయన అభివృద్ధిలో ఎక్కడా రాజీ పడలేదు. తుంగతుర్తి సాగునీరు సరిగా లేక వ్యవసాయ భూములు పడావు ఉండడం గుర్తించి దానికి పరిష్కార మార్గం శ్రీరాంసాగర్ రెండో దశ అని గుర్తించా రు. తుంగతుర్తి నియోజకవర్గానికి శ్రీరాంసాగర్ జలాలు తేవడంలో ప్రధాన భూమిక పోషించారు. 1996లో తిరుమలగిరిలో ప్రగతినగర్ వద్ద ఎస్సారెస్పీ కాల్వలకోసం శంకుస్థాపన చేసి శిలాఫలకం వేయించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలోనూ తనవంతు పోరాటం చేశారు.



సూర్యాపేట టౌన్: రాంరెడ్డి దామోదర్‌రెడ్డి పార్థివదేహం ప్రత్యేక అంబులెన్స్‌లో సాయంత్రం ఆరు గంటలకు సూర్యాపేట పట్టణానికి చేరుకుంది. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నుంచి మొదలైన ర్యాలీ కోర్టు చౌరస్తా, పూల సెంటర్, పొట్టి శ్రీరాములు సెంటర్, రాఘవాప్లాజా నుంచి శంకర్‌విలాస్, ఎంజీ రోడ్డు మీదుగా కొత్తబస్టాండ్, ఖమ్మం క్రాస్ రోడ్ నుంచి రాత్రి 9గంటల సమయంలో దామోదర్‌రెడ్డి నివాసానికి(రెడ్ హౌస్) చేరింది. ప్రజల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఉంచారు. తమ నాయకుడి భౌతికదేహంపై పూలు చల్లి నివాళులర్పించారు.

ఆర్డీఆర్‌కు ప్రముఖుల నివాళి



మాజీమంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి భౌతికకాయానికి పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. మంత్రి సీతక్క, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచందర్‌నాయక్, సీఎల్పీ మాజీ నేత, కాంగ్రెస్ సీనియర్ నేత కుందూరు జానారెడ్డి తదితరులు ఆర్డీఆర్ మృతదేహం పై పూలమాలవేసి నివాళులర్పించారు. నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, పర్యాటక అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్‌లు నివాళులర్పించారు.

సమాజానికి మంచి చేయాలి

● కలెక్టర్ ఇలాత్రిపాఠి



కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ ఇలాత్రిపాఠి, జైలు అధికారి ప్రమోద్

నల్లగొండ క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఖైదీలు జైలు జీవితం నుంచి బయటకు వచ్చిన తర్వాత సమాజానికి మంచి చేయాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. గురువారం గాంధీ జయంతిని పురస్కరించుకొని జిల్లా జైలులో ఏర్పాటు చేసిన ఖైదీల సంక్షేమ దినోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించే క్రమంలో మహాత్మాగాంధీ అనేక సార్లు జైలుకు వెళ్లారని, సత్యాగ్రహం ద్వారా స్వాతంత్ర్యం సాధించారని చెప్పారు. ఖైదీలు జైలు జీవితం అనంతరం సమాజంలో 10మందికి సాయం చేసే విధంగా మెలగాలని పిలుపునిచ్చారు. జైలులో సమయాన్ని వృథా చేయకుండా లైబ్రరీలో ఉన్న పుస్తకాలను చదవాలని, చదువు ద్వారా ఆలోచన పెరుగుతుందన్నారు. జిల్లా జైలు అధికారి ప్రమోద్ మాట్లాడుతూ జిల్లా జైలులో ఖైదీల సంక్షేమంకోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. ఖైదీలు అనేక ఉత్పత్తులను తయారు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమేష్, న్యాయమూర్తి సౌందర్య, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి,బాలకృష్ణ, రాధాకృష్ణ, వెంకట్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీరాం పాల్గొన్నారు.

యువతలో భక్తిభావం పెరగాలి



శోభయాత్రలో పాల్గొన్న అదనపు ఎస్పీ రమేష్

నల్లగొండ క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): యువతలో భక్తిభావం పెంపొందినప్పుడే సమాజంలో మరింత మార్పు వస్తుందని అదనపు ఎస్పీ రమేష్ అన్నారు. జిల్లాకేంద్రంలోని చంద్రగిరి విలాస్ కాలనీలో శుక్రవారం నిర్వహించిన దుర్గమాత శోభయాత్రను ప్రారంభించి ఆయన మాట్లాడారు. భక్తిభావం పెరిగితే ప్రతిఒక్కరూ సరైన మార్గంలో నడుచుకుంటారన్నారు. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అన్ని ఏర్పాట్లను చేసినట్లు వివరించారు.

నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో ఇతర శాఖల సమన్వయంతో పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశామన్నారు. కార్యక్రమంలో రూరల్ ఎస్ఐ సైదాబాబా, కాలనీవాసులు గోవర్ధన్, చందన్, రత్నాకర్‌రావు, కృష్ణ, శంకర్, రవీంద్రనాథ్, సుధాకర్, సత్తయ్య, శ్రీను, సైదులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దసరా .. రూ.30కోట్లు

జిల్లాలో జోరుగా మద్యం విక్రయాలు ● దసరా సందడి

రామగిరి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో దసరా పండుగ సందర్భంగా రూ.30కోట్ల మద్యం విక్రయాలు సాగాయి. సాధారణంగా ప్రతీరోజు రూ.15కోట్ల నుంచి రూ.20కోట్లు విక్రయాలు జరుగుతుండగా.. దసరా పండుగరోజు మాత్రం రెట్టింపు స్థాయిలో విక్రయాలు జరిగినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. దీన్నిబట్టి చూస్తే పట్టణ ప్రజలు ఎంజాయ్ చేసేందుకు ఖర్చుకు ఏమాత్రం వెనక్కి తగ్గడే లేదని స్పష్టం చేస్తున్నారు. వినియోగదారుల అవసరాన్ని ఆసరా చేసుకున్న కొంత మంది వైన్స్ నిర్వాహకులు నిబంధన లు తమకు వర్తించవన్నట్లుగా అర్ధ రాత్రి వరకు విక్రయించారు. వైన్స్‌లో పనిచేసే కొంతమంది గుమస్తాలు సైతం లిక్కర్‌ను ఒకరోజు ముందే ఇళ్లలో నిల్వ చేసుకొని దసరా నాడు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నారు. గత సంవత్సరం కంటే 10శాతం ఎక్కువే విక్రయాలు జరిగినా... ఈ సారి స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యం లో గత సంవత్సరానికి అదనంగా 30శాతం విక్రయాలు జరిగే అవకాశాలుంటాయని అధికారులు అంచనావేశారు. కానీగత సంవత్సరానికి పోల్చుకుంటే 10శాతంమాత్రమే అదనపు వ్యాపారం జరగడంతో దసరా వ్యాపా రంపై గాంధీ జయంతి ప్రభావం పడిందని అధికారులు పేర్కొంటున్నారు.



మాంసం సైతం ఒకరోజు ముందే విక్రయాలు

దసరా పండుగ గాంధీ జయంతి రోజున రావడంతో మటన్, చికెన్ వ్యాపారులు అక్టోబరు 1వ తేదీ అర్ధరాత్రి వరకూ విక్రయాలు జరిపారు. తద్వారా సమారు రూ.కోటి వ్యాపారం జరిగినట్లు అంచనా.

బిజీ బిజీగా నేతలు


స్థానిక సంస్థల ఎన్నికలే రాజకీయాలకు తొలిమెట్టు. అందుకే ఆయా స్థానాలకు అంత ప్రాధాన్యం ఉంటుంది. సర్పంచ్ అయినా, ఎంపీటీసీగా గెలిచినా, జడ్పీటీసీగా విజయం సాధించినా ఆ గుర్తింపే వేరుగా ఉంటుంది. అందుకే ఏ ఒక్క అవకాశాన్నీ వదులుకోకుండా ప్రయత్నాలు చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి - మిర్యాలగూడ టౌన్)

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో దసరా సందర్భంగా పల్లెల్లో ప్రత్యేక సందడి నెలకొంది. రిజర్వేషన్లు ప్రకటించడం, సామాజిక సమీకరణాలు జరగడంతో దాదాపు సీటు తమకే అనుకున్న అభ్యర్థులు బంధుమిత్రుల దసరా సరదా తీరుస్తున్నారు. ఓటర్ల వివరాలు సేకరించడం, దసరా పండుగకు వచ్చిన వారిని కలిసి పలకరించడం కనిపించింది. వారి వారి ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా విందులు, వినోదాలు ఏర్పాటు చేశారు.

ప్రసన్నం చేసుకుంటూ..

నగరంలో నివసిస్తున్నా.. పట్నంలో ఉంటున్నా పండుగకు పల్లెకు రాకుండా ఉండరు. అందులోనూ దసరా పండుగ. అందుకే పల్లెను వీడిన ప్రతిఒక్కరూ గ్రామాలకు వస్తుంటారు. పచ్చనిపైర్ల మధ్య పండుగ నిర్వహించేందుకు పల్లెకొచ్చిన ఓటర్లను ఇదే అవకాశమంటూ ప్రసన్నం చేసుకుంటున్నారు ఆశావహులు.



పండుగకొచ్చిన వారిని ప్రసన్నం చేసుకుంటున్న నాయకులు

మళ్లీ వస్తారు కదా.. అంటూ..

దసరా, దీపావళి పండుగలు కొద్ది రోజుల వ్యవధిలోనే రానున్నప్పటికీ దసరాకు సొంతూళ్లకు వచ్చేవారితో పోలిస్తే దీపావళికి వచ్చే వారు తక్కువగా ఉంటారు. అందుకే విజయదశమి పండుగకు వచ్చిన ఓటర్లను కలిసి ఆప్యాయంగా పలకరించడం, ఫోన్ నెంబరు, అడ్రస్ తీసుకున్నారు. ఎన్నికల షెడ్యూల్‌కు అనుగుణంగా మళ్లీ తప్పక వస్తారు కదా.. అంటూ ఆలింగనం చేసుకుంటున్నారు. పండుగ సంబరాలు ముగియడంతో కొందరు శనివారమే పట్టణాలకు పయనమవుతుండగా, మరికొందరు సండే సరదా చూసుకుని సోమవారం ఉదయం వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

తాయిలాల పంపిణీ షురూ..

మర్రిగూడ: స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ విడుదలవడంతో పల్లెల్లో ఎన్నికల హడావుడి మొదలైంది. ఎన్నికలకోసం ఓటర్లకు చేరువై వారిని ప్రసన్నం చేసుకునే పనిలో పడి ముందస్తుగా తాయిలాల పంపిణీ షురూచేశారు. ఎన్నికల్లో భాగంగా సర్పంచ్, ఎంపీటీసీ పదవులకోసం బరిలో ఉండి పోటీచేసే అభ్యర్థులు ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు మండలంలోని పలు గ్రామాల్లో దసరా పండుగ సందర్భంగా ఇంటింటికీ చికెన్, మద్యం పంపిణీ చేసే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. అభ్యర్థులు దసరా పండుగ నుంచే తాయిలాలు పంపిణీ చేస్తుంటే ఓటర్లు మాత్రం గుట్టుచప్పుడు కాకుండా తీసుకుంటున్నారు. మద్యం, మాంసం కాకుండా అభ్యర్థులు ఇంకా ఎలాంటి తాయిలాలు ఇస్తారోనని ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎంపీటీసీ, సర్పంచ్‌లకు పోటీచేసే అభ్యర్థులకు రూ.లక్షన్నర మించకుండా ఎన్నికల్లో ఖర్చు చేయాలని నిబంధనలు ఉన్నా, అవేవీ పట్టించుకోకుండా ఒక అభ్యర్థి రూ.30లక్షల నుంచి రూ.50లక్షల వరకు ఖర్చుచేసే యోచనలో ఉన్నట్లు సమాచారం.

పండుగ వేళ విషాదం

- రోడ్డు ప్రమాదంలో సోదరులు మృతి
- మృతుల్లో ఒకరు కానిస్టేబుల్



వేముల నాగరాజు, కార్తీక్ (ఫైల్)

దసరా పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపిన క్షణాలు మరిచిపోకముం దే ఓ కుటుంబంలో విషా దం నెలకొంది. ద్విచక్రవాహనం అదుపు తప్పిన ఘటనలో సోదరులు మృతి చెందారు. గురువారం రాత్రి సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం బండరామారం క్రాస్ రోడ్డు వద్ద ఈ విషాదం నెలకొంది. అమ్మమ్మకు పిండి వంటకాలు ఇచ్చి వస్తుండగా ఈ ఘటన జరగడంతో ఆ కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

- (ఆంధ్రజ్యోతి-తుంగతుర్తి)

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు

గుణపాఠం తప్పదు

● మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి

నల్లగొండ,అక్టోబరు3 (ఆంధ్రజ్యోతి): ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఆ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన నల్లగొండ మండల సన్నాహాక సమావేశంలో ఆయన మాట్లాడారు. మోసపు మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో చులకన అయిందన్నారు. ఎక్కడికక్కడ ఆ పార్టీ నాయకులు ప్రజలను దోచుకు తింటున్నారని విమర్శించారు.తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పనులు చేయించుకొని లబ్ధి పొందిన వారు, తీరా ఎన్నికలప్పుడు పార్టీకి వెన్నుపోటు పొడిచారని, తనను కూడా అవమార్చే విధంగా వ్యవహరించారన్నారు. వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలే సమాధానం చెప్పబోతున్నారన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థుల విజయంకోసం ప్రతిఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. సమావేశంలో నాయకులు కటికం సత్తయ్యగౌడ్, కొండూరు సత్యనారాయణ, దేప వెంకట్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవరకొండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా పనిచేసిన రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మృతి బాధాకరమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. దామోదర్‌రెడ్డి ఐదు పర్యాయాలు తుంగతుర్తి, సూర్యాపేట నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది రాష్ట్రమంత్రిగా పనిచేశారని, రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని, ఆయన కుటుంబ సభ్యులకు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి ***
మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ
8 www.andhrajyothy.com ● శనివారం 4 అక్టోబరు 2025

సీపీఎం నేతకు సతీవియోగం

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సీపీఎం రాష్ట్రకమిటీ సభ్యులు, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ డబ్బీకార్ మల్లేష్‌కు సతీవియోగం కలిగింది. మల్లేష్ భార్య సుమిత్రభాయ్(60) శుక్రవారం మృతి చెందారు. అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె మృతి చెందింది. ఆమె మృతి పట్ల సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాయకులు నంద్యాల నర్సింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, వీరారెడ్డి, వెంకటేశ్వర్లు, ఐలయ్య, శ్రీశైలం సంతాపం తెలిపారు.

సీపీఎం అభ్యర్థులను గెలిపించాలి

● పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న చినపాక లక్ష్మీనారాయణ

హాలియా, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిత్యం పోరాటాలు నిర్వహించే సీపీఎం అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చినపాక లక్ష్మీనారాయణ అన్నారు. హాలియాలోని పార్టీ కార్యాలయం శుక్రవారం నిర్వహించిన మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో ప్రజా సమస్యలను వెలికితీసి పరిష్కారానికి కృషి చేసేది కమ్యూనిస్టులేనని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు కనిపించే పార్టీలు, నాయకులు ఆ తర్వాత ప్రజా సమస్యను పట్టించుకోరని, గెలుపు ఓటములతో సంబంధం లేకుండా అధికారం ఉన్నా లేకున్నా ప్రజలతోనే ఉండే నాయకులను ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న నిజాయతీపరులను ఎన్నుకోవాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మండల కార్యదర్శులు దైద శ్రీను, కందుకూరి కోటేష్, దుబ్బ రామచంద్రయ్య, జటావత్ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి ఉత్సవాలు



జెండావిష్కరణ అనంతరం ఉత్సవంలో మాట్లాడుతున్న జనార్దన్

మిర్యాలగూడ టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజారైస్‌మిల్ అపార్ట్‌మెంట్‌లో ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన నల్లగొండ విభాగ్ బౌద్ధిక్ ప్రముఖ్ బంటు జనార్ధన్ కాషాయ జెండాను ఆవిష్కరించి, అనంతరం ఆయుధ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనార్ధన్ మాట్లాడుతూ హిందుత్వాన్ని జీవనవిధానంగా భావిస్తూ జాతి నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ శత వసంతాలు పూర్తి చేసుకోవడం గొప్ప విషయమన్నారు. వందేళ్ల ఉత్సవాలను వాడవాడలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని బస్తీల్లో, విజయదశమి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రముఖులు చెరుపల్లి కరుణాకర్, వీరబొమ్మల యాదగిరి, బండారు ప్రసాద్, సుధాకర్, అజయ్, కిషోర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల్లో ముస్లింల సేవ



హిందువులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లిం సోదరులు

వేములపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని కూడళ్లలో సాయంత్రం సమయంలో శమీపూజ నిర్వహించి రావణదహనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన శమీపూజకు తరలివచ్చిన భక్తులకు హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో మంచినీరు, స్వీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ వేములపల్లి కమిటీ అధ్యక్షుడు ఎండి.ఆమీర్‌షరీఫ్ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా ముస్లింలు ఈ సేవా కార్యక్రమాల్లో పాల్గొని సోదర భావాన్ని పెంపొందించుకోవడం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఎస్‌కె.జావిద్, అబ్దుల్‌రహీం, బాకర్ అలీ, రషీద్, లతీఫ్, ఇమామ్‌షరీఫ్, అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

వెంకట్‌రెడ్డికి అభినందన వెల్లువ

● సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఎంపికపై హర్షం



పడ్మట్‌పల్లిలో సీపీఐ జాతీయ కార్యదర్శి వెంకట్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ కార్యదర్శిగా దేవరకొండ మండలం పడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి ఇటీవల ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ దేవరకొండ మండలం పడ్మట్‌పల్లి గ్రామానికి వెళ్లి మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డిని కలిసి బొకె అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పల్లా వెంకట్‌రెడ్డి సమితి ప్రెసిడెంట్‌గా, నియోజకవర్గ కార్యదర్శిగా, నల్లగొండ జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా సీపీఐలో అంచెలంచెలుగా ఎదిగారని కొనియాడారు. సీపీఐ జాతీయ కార్యదర్శిగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. పల్లా వెంకట్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో కాంగ్రెస్, సీపీఐ నాయకులు ఎం.ఎ.సిరాజ్‌ఖాన్, పల్లా నర్సింహారెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన దసరా సంబురాలు

● భక్తిశ్రద్ధలతో శమీపూజ

● పాల్గొన్న ప్రజాప్రతినిధులు



మిర్యాలగూడ : శమీ పూజలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దంపతులు



మిర్యాలగూడ : కోలాట ప్రదర్శన చేస్తున్న మహిళలు

మిర్యాలగూడటౌన్, దేవరకొండ, హాలియా, తిరుమలగిరి(సాగర్), చింతపల్లి, పెద్దఅడిశర్లపల్లి, గుడిపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దసరా సంబరాలు అంబరాన్నంటాయి. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఎన్నెస్పీ క్యాంపులో నిర్వహించిన దసరా ఉత్సవాలకు పట్టణ, పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. బంగారుగడ్డలోని కన్యకాపరమేశ్వరి ఆలయం, ఉమామహేశ్వరాలయం, ప్రభుత్వ కళాశాల మైదానాల్లో నిర్వహించిన జమ్మి, శమీ పూజలకు భక్తులు తరలివచ్చారు. నృత్యప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించగా, పలు ఇరు చోట్ల నిర్వహించిన క్రాకర్స్ షో, రావణాసుర వధ కార్యక్రమాలు భక్తులను రంజింపజేశాయి. కార్యక్రమాలలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాధినేని శ్రీనివాసరావు, నల్లమోతు సిద్దార్థ, రాంబో శ్రీను, కరుణాకర్, కర్నాటి రమేష్, దుర్గాసత్యం, తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ: దేవరకొండలో దసరా పండగ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన జమ్మిపూజ, రావణ దహన కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే బాలునాయక్ శమీపూజ, రావణ దహన కార్యక్రమంలో పాల్గొని పట్టణ ప్రజలకు దసరా పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు సంవృద్ధిగా పండాలని, వర్షాలు కురియాలని మొక్కినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, నాయకులు జాన్‌యాదవ్, ఆలయకమిటీ నిర్వాహకులు పగిడిమర్రి రఘురాములు, పున్న వెంకటేశ్వర్లు, కొండ్రశ్రీశైలం, నక్క వెంకటేష్‌యాదవ్, సర్వయ్య, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

హాలియా: హాలియాలో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పాల్గొన్నారు. రామాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం పట్టణంలో ఏర్పాటు చేసిన శమీపూజలో పాల్గొన్నారు. రావణ సంహారం చేశారు. పురప్రముఖులకు, కార్యకర్తలకు జమ్మి ఆకుతో శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆలింగనం చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, నాయకులు కాకునూరి నారాయణగౌడ్, మలిగిరెడ్డి లింగారెడ్డి, చింతల చంద్రారెడ్డి, చిట్టిపోలు యాదగిరి, గౌని రాజారమేష్‌యాదవ్, కుకడాల చంద్రమౌళి, వెంపటి శ్రీనివాస్, వడ్డే సతీష్‌రెడ్డి, కృష్ణ, శ్రీనివాస్, లింగయ్య, వెంకన్న పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): మండలంలో దసరా వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో, దుర్గాదేవి మండపాల్లో భక్తులు అధిక సంఖ్యలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠించిన దుర్గామాత విగ్రహాలను పలు గ్రామాల్లో ఊరేగించి నిమజ్జనం చేశారు. మండల కేంద్రంలో నిర్వహించిన దేవినవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దుర్గాదేవి అమ్మవారికి అర్చకులు నర్సింహాచార్యులు ఆధ్వర్యంలో పూర్ణాహుతి హోమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో విగ్రహ దాత వెన్నపూసల శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, జూపల్లి గోపి నాగమణి, శాగం గోపినాథ్‌రెడ్డి ప్రవళిక, కమిటీ సభ్యులు ప్రశాంత్, నితిన్, సందీప్, సంపత్, చెన్నకేశవ్‌రెడ్డి, కార్తీక్, సైదులు, మణి, ధనుష్, గణేష్ పాల్గొన్నారు.

చింతపల్లి: మండలంలో దసరా వేడుకలను ప్రజలు సంతోషంగా నిర్వహించారు. ప్రధానంగా మండల కేంద్రంలో రాజరాజేశ్వరి దేవాలయ సమీపంలో నిర్వాహకులు మహిశాసురిడిని దగ్ధం చేశారు. అంతకు ముందు జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దఅడిశర్లపల్లి, గుడిపల్లి: విజయదశమి సందర్భంగా ఉమ్మడి పీఏపల్లి, గుడిపల్లి మండలాల్లో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు శమీ వృక్షానికి, ఆయుధాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీగా తరలివచ్చిన ప్రజలు జమ్మిపత్రిని ఒకరినొకరు ఇచ్చి పుచ్చుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.





హాలియా: రావణ సంహరించేందుకు విల్లు ఎక్కుపెట్టిన ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, పట్టణంలో ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే, నాయకులు





దేవరకొండలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్, పాల్గొన్న పట్టణ ప్రజలు

ఘనంగా అమ్మవారి శోభాయాత్ర



దామరచర్లలో అమ్మవారి శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

దామరచర్ల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని కనకదుర్గ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని భక్తులు డప్పు చప్పుళ్ల నడుమ శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి నీళ్లారబోసి టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలో నల్లగొండ రోడ్డులో హనుమాన్‌నగర్ (పాతఊరు)లో ప్రతిష్ఠించిన అమ్మవారి మండ పం వద్ద దుర్గామాత గురువారం రాజరాజేశ్వరి మాతగా దర్శనమిచ్చింది. భక్తులు అమ్మవారిని అధికసంఖ్యలో దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బోడ కుమార్, కిరణ్‌కుమార్, లక్ష్మమ్మ, బోడ కృష్ణ, పూజారులు ఘంటసాల శివప్రసాద్‌శర్మ పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి, గుడిపల్లి: ఆలయాలు, మండపాలు, చలువ పందిర్లలో కొలువైన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుడిపల్లి మండలకేంద్రంలోని దుర్గామాతకు మూడు రోజులుగా కున్‌రెడ్డి అనూష- రాజశేఖర్‌రెడ్డి దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ ఆయురారోగ్యాలలు, అష్టఐశ్వర్యాలతో బాగుండాలని ఈ మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి: అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



గుడిపల్లి మండలకేంద్రం భవానీ స్వాములతో కున్‌రెడ్డి అనూషరాజశేఖర్‌రెడ్డి దంపతులు

మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడవాలి

దేవరకొండ, మిర్యాలగూడ టౌన్, కొండమల్లేపల్లి, చింతపల్లి, పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీ అడుగుజాడల్లో యువత పయనించాలని పలువురు సూచించారు. మహాత్మాగాంధీ జయంతిని గురువారం జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ చూపిన సత్యం, ధర్మం, అసింహ మార్గాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని అన్నారు.

● దేవరకొండలో ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రమణారెడ్డి, మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ సుదర్శన్, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు ఎస్‌వీటీ గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. బ్రిటీష్ పాలన నుంచి భారతదేశం స్వాతంత్ర్యం సాధించడానికి అహింసమార్గంలో పోరాడిన గొప్ప వ్యక్తి జాతిపిత మహాత్మాగాంధీ అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు బెజవాడ శేఖర్, వస్కుల సుధాకర్, స్పోర్ట్స్ అసోసియేషన్ నాయకులు వంగూరి వెంకటేశ్వర్లు, తాళ్ల శ్రీధర్‌గౌడ్, కృష్ణకిషోర్, శ్యాంసన్, రాపోలు నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



పీఏపల్లి: అంగడిపేట ఎక్స్‌రోడ్డు వద్ద గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

● మిర్యాలగూడ పట్టణంలో సోషల్ వర్కర్, ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకులు ధీరావత్ హన్యానాయ క్ మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ చూపిన సన్మార్గంలో పయనించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రమాబాయి, సుధారాణి, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

● కొండమల్లేపల్లిలో గ్రామపంచాయతీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రవీణ్, లక్ష్మణ్, మాధవ్, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

● చింతపల్లి మండల కేంద్రంతో పాటు వీ.టి.నగర్‌లో ఆర్యవైశ్యులు గాంధీజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమలో ఆర్యవైశ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు వూరె లక్ష్మణ్, మండల అధ్యక్షుడు వందనపు ఆంజనేయులు, దాచేపల్లి మధు, హరిప్రసాద్, శ్రీను పాల్గొన్నారు.



దేవరకొండ: గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

● పెద్దఅడిశర్లపల్లి నిర్వహించిన కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు విడియాల రామయ్య, ప్రధాన కార్యదర్శి సముద్రాల శేఖర్ మాట్లాడుతూ గాంధీజీ చూపిన సత్యం, ధర్మం, అసింహ మార్గాలు ప్రతి ఒక్కరూ అనుసరించాలని అన్నారు. గాంధీ అహింస మార్గంతోనే దేశానికి స్వాతంత్ర్యం సాధించారని, ప్రతి ఒక్కరూ మహాత్ముడిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగినప్పుడే దేశం సర్వోన్నతి చెందుతుందన్నారు. కార్యక్రమంలో వీరమళ్ల పరమేష, విడియాల బిక్షమయ్య, గట్టు శ్రీనివాస్, దొడ్డి లక్ష్మయ్య, విడియాల వెంకటయ్య, విడుకుళ్ల నాగేష్, సతీష్ కుమార్, శ్రీను, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలి

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



అంగడిపేట దుర్గామాత పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్, కాంగ్రెస్ నాయకులు

పెద్దఅడిశర్లపల్లి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. మండలంలోని అంగడిపేట తండాలో నూతనంగా నిర్మించిన శ్రీతుల్జాభవానీ మాత అమ్మవారి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలునాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలని, అమ్మవారి ఆశీస్సులు అంగడిపేట ప్రజలు, నియోజకవర్గంతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బాలునాయక్‌కు శాలువాతో ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అంగడిపేట, అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద దుర్గామాత అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వంగాల ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు కుక్కల గోవర్ధన్‌రెడ్డి, నెర్మటి సతీష్‌రెడ్డి, వంగాల వెంకట్‌రెడ్డి, డాక్టర్ పాల్వాయి వెంకట్‌రెడ్డి, తేరా సత్యంరెడ్డి, బొల్లు గోవింద్ యాదవ్, వీరమళ్ల పరమేష్, సతీష్‌కుమార్, బోడియానాయక్, పాండు నాయక్, శంకర్‌నాయక్, రమావత్ చిరంజీవి, బొల్లు సత్యనారాయణ, అక్బర్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.